PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 282 | విజయవాడ, శుక్రవారం 16 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 16 May 2025 | Rs



20న వక్ఫ్ సవరణలపైనే విచారణ

- జస్టిస్ గవాయ్ బెంచ్ నిర్ణయం

7

ఇంగ్లండ్ పర్యటనకు శ్రీచరణి

- భారత మహిళల జట్టును ప్రకటించిన బిసిసిఐ

8



రూ.33 వేల కోట్ల


పెట్టుబడులకు అనుమతి

పారిశ్రామిక ప్రగతివైపు అడుగులు

ఎస్ఐపిబి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ఆరో సమావేశం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగింది. గత ఐదు సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, అనుమతులపై సమీక్షించారు. 11 నెలలకాలంలో ఇప్పటి వరకూ 76 ప్రాజెక్టులకు సంబంధించి రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు అమోదం తెలిపింది. వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయని పేర్కొన్నారు. తాజాగా గురువారం జరిగిన సమావేశంలో 19 ప్రాజెక్టులకు రూ.33 వేల కోట్లకుపైగా పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఎనర్జీ, టూరిజం, ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఈ పెట్టుబడుల ద్వారా దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకు వచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలు, ప్రాజెక్టుల శంకుస్థాపన నుండి ప్రారంభోత్సవం వరకూ అధికారులు పర్యవేక్షించాలని, ప్రతి ప్రాజెక్టు పురోగతి నిరంతరం ఫాలోచేయాలని ఆదేశించారు. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్రస్థాయి పనులు స్థితిగతులు తెలుసుకునేందుకు డాష్‌బోర్డు తీసుకురావాలని, తద్వారా ఏ ప్రాజెక్టు ఏ స్థాయిలో ఉందనేది తెలుసుకోవచ్చని తెలిపారు.



స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

పెట్టుబడులతోపాటు వచ్చిన ఉద్యోగాల వివరాలతో పోర్టల్ రావాలని, ఎస్ఐపిబి సమావేశాల్లో కొత్త పెట్టుబడులకు ఆమోదం తెలపడంతోపాటు ఇప్పటికి ఆమోదం తెలిపిన ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రోగ్రస్ వివరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

50 వేల హోటల్ రూములు

టూరిజం సెక్టార్లో హోటళ్ల కొరత ఉందని, పెద్దఎత్తున రూములు అందుబాటులోకి వస్తే పర్యాటకానికి ఊపు వస్తుందని సిఎం అన్నారు. 50 వేల రూములు అందుబాటులోకి తేవాలని, దీనివల్ల పర్యాటకులు బసకు ఇబ్బంది ఉండదని, కారవాన్స్‌కు సంబంధించిన పాలసీ కూడా అమల్లోకి తేవడం ద్వారా కొత్త పర్యాటకులకు కొత్త అనుభూతి వస్తుందని పేర్కొన్నారు. పర్యాటక ఆదాయమూ పెరుగుతుందని వివరించారు. దేవాలయాలకు వచ్చేవారికి మంచి వసతి ముఖ్యమని పేర్కొన్నారు. కుటుంబాలతో వచ్చేవారు ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతావరణంలో ఉండేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో 21 దేవాలయాల్లో వసతి సౌకర్యం పెంచే చర్యలు తీసుకోవాలని, టెంట్లు ఏర్పాటు చేసి వసతి కల్పించే ప్రాజెక్టులూ కల్పించాలన్నారు. గోదావరి, కృష్ణా హారతుల కార్యక్రమం ఆధ్యాత్మికత పెంచేలా నిర్వహించాలని సూచించారు. చిన్న చిన్న ప్లాంట్ల ద్వారా అగ్రికల్చర్ వేస్టును సర్క్యులర్ ఎకానమీగా, సద్వినియోగం చేసుకునే పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు.

ఎస్ఐపిబి ఆమోదించిన పరిశ్రమలు

అనకాపల్లి జిల్లా కుమరవరం వద్ద డెక్కన్ ఫైన్ కెమికల్స్ రూ.1560 కోట్లు, రాంబిల్లిలో బ్లూజెట్ హెల్త్‌కేర్ రూ.2300 కోట్లు, జూపిటర్ రెన్యువలబుల్ ప్రైవేటు లిమిటెడ్ రూ.2700 కోట్లు, అచ్యుతాపురంలో ఎటిసి టైర్స్ రూ.1779 కోట్లు పెట్టుబడులకు అనుమతి ఇచ్చారు. అలాగే శ్రీసత్యసాయిజిల్లా పాలసముద్రం వద్ద బిఈఎల్ రూ.1400 కోట్లు, కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద పియుఆర్ ఎనర్జీ రూ.1286 కోట్లు పెట్టుబడులకు అవకాశం కల్పించారు. తణుకు వద్ద రామభద్ర ఇండ్రస్టీస్ రూ.228 కోట్లు, కృష్ణాజిల్లా మల్లవల్లిలో మోహన్ స్పింటెక్స్ రూ.482 కోట్లు, తిరుపతి జిల్లాలో వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ రూ.1061 కోట్లు, కుప్పం లీప్‌లో రూ.5 కోట్లు, ఏలూరు జిల్లాలో నితిన్‌సాయి కనస్ట్రక్షన్స్‌కు రూ.150 కోఉట్ల, దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్‌కు రూ.2920 కోట్లు, కడప జిల్లాలో ఆంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్‌కు రూ.3941 కోట్లు, సత్యసాయి జిల్లాలో బొండాడ ఇంజనీరింగ్ కళాశాల రూ.9000 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. తిరుపతిలో బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ లిమిటెడ్ రూ.150 కోట్లు, స్రవంతి హోటల్స్ లిమిటెడ్ రూ.327 కోట్లు, వరుణ్ హాస్పిటాలిటీ లిమిటెడ్ విశాఖపట్నంలో రూ.899 కోట్లతో హోటళ్లు ఏర్పాటు చేయనున్నారు. తిరుపతి జిల్లా శ్రీసిటీలో డైకిన్ ఎయిర్ ఇండియా లిమిటెడ్ రూ.2475 కోట్లు, కర్నూలు జిల్లాలో సెన్సోరెమ్ ఫోటోనిక్స్ రూ.1057 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి.

ఉద్యోగుల బదిలీలపై నిషేధం సడలింపు

- నేటి నుంచి జూన్ 2 వరకు ట్రాన్స్‌ఫర్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలిస్తూ ఆర్థికశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. శుక్రవారం నుంచే ఈ సడలింపు అమలులోకి వస్తుందని, జూన్ రెండో తేదీ వరకు కొనసాగుతుందని వివరించింది. ఈ నెల 31వ తేదీ నాటికి ఒకే స్థానంలో ఐదేళ్ల కన్నా ఎక్కువ కాలం పనిచేసిన వారికి తప్పనిసరిగా బదిలీలు ఉంటాయని స్పష్టం చేసింది. వచ్చే ఏడాది మే 31లోగా ఉద్యోగ విరమణ చేసే వారికి వారి కోరిక మేరకు బదిలీ చేయవచ్చునని పేర్కొన్నారు. దృష్టి లోపం ఉన్న వారికి, మానసిక సమస్యలతో బాధపడే పిల్లలున్న ఉద్యోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందుబాటులో ఉండే ప్రాంతాలకు బదిలీ చేయవచ్చునని ఆర్థికశాఖ పేర్కొంది. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకన్నా ఎక్కువ కాలం పనిచేసిన వారు, 40 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారికి కూడా బదిలీల్లో ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. భార్య, భర్త, పిల్లలకు కేన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, న్యూరో సమస్యలు, కిడ్నీ మార్పిడి వంటి కీలక వ్యాధులతో సమస్యలు ఉంటే వారికి కూడా బదిలీల్లో ప్రాధాన్యత ఉంటుందని పేర్కొంది. అలాగే కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం పొందిన వితంతువులకు కూడా బదిలీల్లో అవకాశం ఉంటుందని వివరించింది. దృష్టిలోపం సమస్యలు ఉన్న వారు కోరుకుంటే తప్ప బదిలీలు ఉండవని స్పష్టం చేసింది. స్పౌస్ కేసుల్లో కూడా ఒకే చోటగానీ, దగ్గరలో ఉన్న స్థానంలోగానీ నియమించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొంది. ఉద్యోగుల బదిలీలన్నీ ఐచ్ఛిక బదిలీలుగానే భావించాల్సి ఉంటుందని, వారికి ట్రావెల్ అలవెన్సులు ఉండవని స్పష్టం చేసింది.

జులై 9కి సార్వత్రిక సమ్మె వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈ నెల 20న జరగాల్సిన కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె జులై 9 నాటికి వాయిదా పడింది. గురువారం నాడిక్కడ కేంద్ర కార్మిక సంఘాల నేతలు సమావేశమయ్యారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 20న జరగాల్సిన సార్వత్రిక సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశం ఇంత తీవ్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ, లేబర్ కోడ్‌ల అమలును దూకుడుగా ముందుకు తీసుకెళ్తోందని విమర్శించారు. కార్మికుల పని గంటలను పెంచుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల హక్కులను కాలరాస్తోందని కేంద్ర కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. జులై 9న సార్వత్రిక సమ్మెను నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దీనిపై యజమానులు, అధికారులకు అవసరమైన సమాచారం అందజేయాలని సూచించారు. ఈ నెల 20న పని ప్రదేశం, స్థానిక, జిల్లా స్థాయిల్లో సమీకరణలు జరగాలని తెలిపారు. ప్రజల్లో సమ్మె ప్రచారాలను కొనసాగించాలని పేర్కొన్నారు. జులై 9వ తేదీన సమ్మెను జయప్రదం చేసేందుకు సమాయత్తం కావాలని కేంద్ర కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు.

కదంతొక్కిన కోకో రైతులు

- మోండలీజ్ కంపెనీ కార్యాలయం ఎదుట మహాధర్నా
- 17 నుంచి కంపెనీ కార్యాలయాలు, గొడౌన్ల ఎదుట రిలే దీక్షలు

3

20 నుంచి సమైక్యతా యాత్రలు

- జాతీయ జెండాను మోసే అర్హత బిజెపికి లేదు
- రాష్ట్రంలో భూ కేటాయింపులపై శ్వేత పత్రాన్ని ప్రకటించాలి
- స్టీల్‌ప్లాంట్ కార్మికులపై నిర్బంధం ఆపాలి : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రజలకు వాస్తవాలు చెప్పి ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి వారిని సమాయత్తం చేయడానికి ఈ నెల 20 నుంచి 30 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా సమైక్యతా యాత్రలు, సదస్సులు జరపాలని సిపిఎం నిర్ణయించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటించారు. గురువారం విశాఖలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని తరగతుల ప్రజలూ సిపిఎం చేపట్టే సమైక్యతా కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖలో ఉర్సా కంపెనీకి ఎకరా 99 పైసలకు భూముల కేటాయిపును ప్రజలంతా వ్యతిరేకించగా ఎకరా రూ.1.50 కోట్లు అని చంద్రబాబు చెప్పడం దారుణమన్నారు. ఎవరీ ఉర్సా ? అని సిపిఎం అడిగినా ప్రభుత్వం వద్ద సమాధానం లేదన్నారు. విశాఖలో ఐటి కంపెనీలు రావాలని సిపిఎం కోరుతోందని, అయితే గతంలో అదానీ డేటా సెంటర్‌కు 130 ఎకరాలు కేటాయించినా ఇంతవరకూ అతీగతి లేదని అన్నారు. అమరావతిలో



మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, చిత్రంలో జగ్గునాయుడు

రాజధాని కోసం గతంలో తీసుకున్న వేల ఎకరాలు చాలవా ? అని అక్కడి ప్రజలే అడుగుతున్నారని, మరో 44 వేల ఎకరాలు ఇటీవల తీసుకోవడం దేని కోసమని ప్రశ్నించారు. విశాఖ, అమరావతిలో కేటాయించిన భూముల వల్ల రియల్ ఎస్టేట్ కోసం తప్ప ప్రజలకు ఏం మేలు జరిగిందో శ్వేతపత్రాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం ఇచ్ఛాపురంలో గిరిజనులు నివసించే కొండలను క్వార్ట్జైట్ మైనింగ్‌కు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం సరైంది కాదని అన్నారు. గతేడాది ఇక్కడే కుసులవాడలో మైనింగ్ చర్యలపై ప్రజలు తిరగబడ్డారని గుర్తుచేశారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రత్యేక ప్యాకేజీ మిగతా 7లో

ఎపి ఇసెట్ ఫలితాలు విడుదల

- 93.26 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు, ఎపి ఉన్నత విద్యామండలి సంయుక్తంగా నిర్వహించిన ఎపి ఇసెట్-2025 పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయి. గురువారం సాయంత్రం అనంతపురం జెన్‌టియు ఉపకులపతి ఛాంబర్‌లో ఎపిఇసెట్ ఛైర్మన్, జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు ఫలితాలను విడుదల చేశారు. ఈ నెల ఆరున నిర్వహించిన 2025-ఎపిఇసెట్ పరీక్షకు 35,187 మంది దరఖాస్తు చేసుకోగా 34,228 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 31,922 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. జిల్లాల వారిగా చూసినప్పుడు 95.80 శాతం ఉత్తీర్ణతతో మెదటి స్థానంలో కృష్ణా జిల్లా, విజయనగరం 89.34 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి హైదరాబాద్ 97.33 శాతంతో ఉత్తీర్ణతలో మెదటి స్థానంలో నిలిచింది. ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చైర్మన్ తెలిపారు.

కాలపరిమితి విధించవచ్చా?

సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ : రాష్ట్ర గవర్నర్లు పంపే బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి కాలపరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన చారిత్రక తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 14 ప్రశ్నలు సంధించారని సమాచారం. రాష్ట్రపతికి కాలపరిమితి విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉన్నదా? అని సందేహం వ్యక్తం చేశారు. తమిళనాడు ప్రభుత్వం, ఆ రాష్ట్ర గవర్నర్ మధ్య నెలకొన్న వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ గవర్నర్లు పంపే బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతికి గడువు విధించింది. రాష్ట్రపతి అనుమతి కోసం తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి 10 బిల్లులను తన వద్ద అట్టే పెట్టుకోవడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పుపై కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తూ ఈ నెల 13న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఓ ప్రశ్నావళిని పంపినట్లు వార్తలు వచ్చాయి. తమ అనుమతి కోసం వచ్చిన బిల్లులపై చర్య తీసుకోవడానికి ఆర్టికల్ 143 ప్రకారం గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి నిర్దేశించి విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉన్నదా? అని ఆమె ప్రశ్నించారు. ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి ఇచ్చే అనుమతులు సమర్ధనీయమా అనే విషయంపై సైతం సుప్రీంకోర్టు భిన్నమైన తీర్పులు ఇచ్చిందని గుర్తు చేశారు.



(ఫైల్)

గవర్నర్ ముందున్న మార్గాలు ఏమిటి?

'లైవ్‌లా' పోర్టల్ ప్రకారం సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పంపిన 14 ప్రశ్నలు ఇలా ఉన్నాయి. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద తనకు బిల్లులు పంపినప్పుడు గవర్నర్ ముందు ఉన్న రాజ్యాంగపరమైన మార్గాలు ఏమిటి? ఆర్టికల్ 200 కింద తనకు ఓ బిల్లును పంపినప్పుడు తనకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటూ మంత్రిమండలి అందించే సహాయానికి, సలహాకు గవర్నర్ కట్టుబడి ఉంటారా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద గవర్నర్ రాజ్యాంగ విచక్షణను ఉపయోగించడం న్యాయబద్ధమేనా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ తీసుకునే చర్యపై న్యాయ సమీక్షకు మిగతా 7లో

రాజ్యాంగంపై మరోదాడి

- రాష్ట్రపతి ప్రశ్నావళిపై సిపిఎం

తమిళనాడు వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పును తప్పుపడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా ప్రశ్నావళిని సంధించడాన్ని సిపిఐ (ఎం) నిరసించింది. ఇది సుప్రీంకోర్టు తీర్పు నుండి తప్పించుకోవడమే అవుతుందని వ్యాఖ్యానించింది. రాజ్యాంగం యొక్క సమాఖ్య స్వభావాన్ని, రాష్ట్రాల హక్కులను సుప్రీం తీర్పు పరిరక్షించిందని గుర్తు చేసింది. రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టుకు ప్రశ్నలు పంపడం రాజ్యాంగంపై జరిగిన మరో దాడిగా అభివర్ణించింది.

సుప్రీం తీర్పును తారుమారు చేసేలా ప్రశ్నలు

- తమిళనాడు సిఎం స్టాలిన్

7

2027 నాటికి భూముల డిజిటలైజేషన్

- 'సర్వే-రీసర్వే'పై జాతీయ వర్క్‌షాపులో కేంద్ర మంత్రి పెమ్మసాని
- 29 రాష్ట్రాల నుంచి అధికారుల హాజరు



వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న పెమ్మసాని, వేదికపై మంత్రి అనగాని తదితరులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశవ్యాప్తంగా భూముల రీ సర్వే ప్రక్రియ వేగంగా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సర్వే ప్రక్రియ త్వరగా పూర్తి చేసి రికార్డుల డిజిటలైజేషన్‌ను 2027 కల్లా పూర్తి చేస్తామన్నారు. భూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను అధ్యయనం చేసేందుకు 29 రాష్ట్రాలు , ఐదు కేంద్ర పాలిత ప్రాంతాల నుండి వచ్చిన ప్రతినిధులకు 'సర్వే-రీ సర్వే' అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాపు గురువారం గుంటూరులో జరిగింది. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ వర్క్‌షాపులో వివిధ రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఈ ప్రక్రియ ప్రారంభం అయినా అస్తవ్యస్తంగా చేశారని, కేవలం ప్రచారం కోసం అప్పటి సిఎం జగన్ తన ఫోటోలతో పాస్‌పుస్తకాలు, హద్దురాళ్లను ఏర్పాటు చేశారని అన్నారు. భూ వివాదాన్ని భూవిశ్వాసంగా మార్చే ప్రక్రియను టిడిపి కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. దేశ వ్యాప్తంగా ఈ సర్వే-రీ సర్వే చేయాలని కేంద్రం నిర్ణయించినా కేవలం ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌లోనే వేగంగా జరిగిందని, కొన్ని రాష్ట్రాల్లో మందగమనంగా ఉందన్నారు. భూ వివాదాలు ఏళ్ల తరబడి కోర్టుల్లో పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. వంద సంవత్సరాల తర్వాత భూముల సర్వే జరుగుతుంద న్నారు. నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సర్వే చిన్న, సన్నకారు రైతులకు, మహిళలు, ఎస్‌సి, ఎస్‌టిలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో భూ రికార్డుల డిజిటలైజేషన్ సజావుగా జరిగేలా చూడాలన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. వంద సంవత్సరాల క్రితం ఉన్న ల్యాండ్ రికార్డులను రీ సర్వే ద్వారా డిజిటలైజేషన్ చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. గత ప్రభుత్వంలో 6683 గ్రామాల్లో సర్వే జరిగితే 2.85 లక్షల మంది నుంచి అభ్యంతరాలు వచ్చాయన్నారు. వీటిని పరిష్కరించేందుకు నామినేటెడ్ ప్రాతిపదికన అథారిటీని నియమించేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. తాము కేవలం అధికారులకు అప్పీలు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ప్రతి భూ యజమానికి హక్కుతో కూడిన పట్టా ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రీసోర్స్ ఆధ్వర్యంలో ఈ సర్వేలు చేపట్టడం జరుగుతుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి మనోజ్ జోషి, రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జి జయలక్ష్మి, కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి, రాష్ట్ర సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు ప్రసంగించారు.

వెంటనే క్షమాపణ చెప్పాలి

- విజయ్ షాపై సుప్రీం ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కల్నల్ సోఫియా ఖురేషీని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి, బిజెపి నేత కున్వర్ విజయ్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆమె ఉగ్రవాదుల సోదరి అంటూ ఒక సభలో విజయ్ షా చేసిన వ్యాఖ్యలు శత్రుత్వం, విద్వేషాన్ని ప్రోత్సహించడం, రెచ్చగొట్టేవిధంగా ఉన్నాయని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాలతో కేసు నమోదైంది. షా పిటిషన్‌ను శుక్రవారం విచారించేందుకు అంగీకరిస్తూనే, జోక్యం చేసుకోవడానికి సిజెఐ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం నిరాకరించింది. మంత్రులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని, షా వ్యాఖ్యలు అనుచితమైనవని, ఏమాత్రం ఆమోదయోగ్యం కావని సిజెఐ అన్నారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు ప్రసంగాలు చేసేటప్పుడు సంయమనం పాటించాలన్నారు. అసలేం మాట్లాడుతున్నారు. ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు చెప్పండి అంటూ విజయ్ షాను సుప్రీంకోర్టు ఆదేశించింది.

ట్రంప్‌నకు దాసోహం

- సున్నా టారిఫ్‌లకు భారత్ అంగీకారం
- అమెరికా అధ్యక్షుడి ప్రకటన

న్యూఢిల్లీ : వాణిజ్య విధానంలో అమెరికాకు భారత్ మోకరిల్లింది. అమెరికా ఉత్పత్తులకు ఇకపై భారత్‌లో సుంకాలు ఉండవని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడమే ఇందుకు నిదర్శనం. ట్రంప్ ప్రస్తుతం మధ్యప్రాచ్య దేశాల పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలో ఖతార్ రాజధాని దోహాలో వ్యాపారవేత్తల ప్రతినిధుల బృందంతో సమావేశమయ్యారు. ఈ చర్చల్లో ట్రంప్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు భారతదేశంలో ఏదైనా వస్తువు అమ్మడం చాలా కష్టమని అన్నారు. తాజాగా తమ దేశం నుంచి దిగుమతి చేసుకునే చాలా రకాల వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌లను ఆఫర్ చేసిందని చెప్పారు. దీనికి సంబంధించి అమెరికాకు భారత్ ఓ ఒప్పంద ప్రతిపాదన పంపిందన్నారు.

సంక్లిష్ట చర్చలు : జైశంకర్

ట్రంప్ తాజా ప్రకటనపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయని, అవి సంక్లిష్ట చర్చలని అన్నారు. ప్రతి అంశంపై నిర్ణయం తీసుకునేవరకు అవి కొనసాగుతూనే ఉంటాయని పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందం పరస్పరం ప్రయోజనకరంగా ఉండాలన్నారు. ట్రంప్ జీరో టారిఫ్ వ్యాఖ్యలను ఆయన ఖండించలేకపోవడం గమనార్హం.



(ఫైల్)

పెట్టుబడులకు విఘాతం..

"నాకు టిమ్ కుక్‌తో నిన్న చిన్న సమస్య ఎదురైంది. అతడు భారత్‌లో తయారీ యూనిట్ల విస్తరణను చేపట్టారు. అలా చేయడం నాకు ఇష్టం లేదని చెప్పాను. ఫలితంగా అమెరికాలో ఉత్పత్తి పెంచేందుకు ఆపిల్ అంగీకరించింది" అని ట్రంప్ తెలిపారు. గత కొన్నేళ్లుగా ఆపిల్ భారతదేశంలో తన తయారీ సామర్థ్యాన్ని క్రమంగా విస్తరిస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల యుఎస్, చైనా మధ్య నెలకొన్న టారిఫ్ యుద్ధంతో ఇండియాలో తన కార్యకలాపాలను పెంచాలని నిర్ణయించినట్లు టిమ్ కుక్ ఇటీవల తెలిపారు. భారత్‌లో ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలు ఐఫోన్ మిగతా 7లో

సిపిఎం నేతలపై అక్రమ కేసులు కొట్టివేత

ప్రజాశక్తి - విజయవాడ

శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ఆందోళన చేసిన సిపిఎం నేతలపై అప్పటి వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును కొట్టివేస్తూ విజయవాడ ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ కోర్టు, జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ గురువారం తీర్పు చెప్పారు. ఈ కేసులో 13 మంది సిపిఎం నేతలను నిర్దోషులుగా ప్రకటించింది. 2022 అక్టోబర్‌లో విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లోని హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని, దెబ్బతిన్న రేకుల షెడ్డును పునర్నిర్మించాలని, దహన సంస్కారాలు సక్రమంగా జరుపుకునే అవకాశం కల్పించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శ్మశానవాటిక వద్ద శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, నాయకులు దుర్గారావు తదితరుల నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన సిపిఎం కార్యకర్తలపై ఐపిసి సెక్షన్ 341, 188, 143, 290, రెడ్‌విత్ 149 పోలీస్ యాక్ట్, సెక్షన్ 32 పేరుతో అక్రమంగా కేసు నమోదు చేసింది. విచారణ జరిపిన విజయవాడ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గురువారం ఈ కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు. 13 మందిని నిర్దోషులుగా ప్రకటించింది.

డెంగీ నివారణకు చర్యలు

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డెంగీ వ్యాధిని అరికట్టేందుకు సమర్ధవంతమైన చర్యలు చేపట్టాలని అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. జాతీమ డెంగీ దినోత్సవం సందర్భంగా సచివాలయంలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో డెంగీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో డెంగీ గతేడాదితో పోలిస్తే తగ్గుముఖం పట్టినప్పటికీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 55 గుర్తించబడిన సెంటినెల్ సర్వైలెన్స్ కేంద్రాల్లో ఉచితంగా డెంగీ నిర్ధారణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్, ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ పద్మావతి, జాయింట్ డైరెక్టర్ మల్లేశ్వరి, డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- డిస్కంల సిఎమ్‌డిలతో మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ పంపిణీ సంస్థల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డిఎస్ఎస్), పిఎం సూర్యఘర్ పనుల పురోగతిపై డిస్కంల సిఎమ్‌డిలతో సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఆర్‌డిఎస్ఎస్ పనులను వేగవంతం చేయాలని మంత్రి చెప్పారు. సూర్యఘర్‌పై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి పునరుత్పాదక విద్యుదుత్పత్తి వైపు వారిని ప్రోత్సహించాలని చెప్పారు. రైతులకు అవసరమైన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. దరఖాస్తుదారుల్లో అర్హులైన వారికి వ్యవసాయ సీజన్ కనెక్షన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరాను అందించాలని చెప్పారు. అప్రకటిత కోతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగితే స్థానిక ప్రజలకు ముందస్తు సందేశం అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డి పుల్లారెడ్డి హాజరవ్వగా, వర్చువల్‌గా ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి ఐ పృథ్వీతేజ్, ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి కె సంతోషరావు హాజరయ్యారు.

జర్నలిస్టు అక్రిడిటేషన్‌లపై మంత్రివర్గ ఉపసంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జర్నలిస్టులకు మంజూరు చేసే అక్రిడిటేషన్‌లపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఇందుకు సంబంధించిన జిఓ 929ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ గురువారం విడుదల చేశారు. గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిపి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కన్వీనర్‌గా సాధారణ పరిపాలనశాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ఉంటారు. సమాచార శాఖ డైరెక్టర్ ఈ కమిటీకి మార్గదర్శకాల సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

అసంబద్ధ నిబంధనలు తొలగించాలి

- ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలి
- యుటిఎఫ్ ధర్నాలో నేతలు
- చర్చలు జరిపిన పాఠశాల విద్య డైరెక్టర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



విద్యాభవన్ వద్ద బైఠాయించి ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నేతలు

రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణల్లో భాగంగా అమలు చేస్తున్న అసంబద్ధ నిర్ణయాలను తొలగించాలని యుటిఎఫ్ ధర్నాలో నేతలు డిమాండ్ చేశారు. పాఠశాల విద్యలో తీసుకొస్తున్న సంస్కరణలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ పాఠశాలల రక్షణ పేరుతో పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ (విద్యాభవన్) కార్యాలయం వద్ద గురువారం యుటిఎఫ్ ధర్నా నిర్వహించింది. పెద్దయెత్తున తరలివచ్చిన ఉపాధ్యాయులు విద్యాభవన్ వద్ద బైఠాయించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ధర్నా జరుగుతున్న సమయంలోనే పిడిఎఫ్ ఎమ్మెల్సీలను, యుటిఎఫ్ నేతలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు చర్చలకు పిలిచారు. యుటిఎఫ్ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అంతకుముందు ధర్నానుద్దేశించి పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి గోపిమూర్తి మాట్లాడుతూ.. విద్యారంగంలో సంస్కరణల పేరుతో ప్రాథమిక పాఠశాల వ్యవస్థను ప్రభుత్వాలు బలహీన పరుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంకు ఇచ్చే నిధుల కోసం విద్యారంగాన్ని ధ్వంసం చేస్తున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలను ప్రవేశపెడితే ప్రస్తుత ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలను ప్రవేశపెడుతుందన్నారు. గత ప్రభుత్వంలానే కూటమి ప్రభుత్వం కూడా పాఠశాల విద్యలో అసంబద్ధమైన నిర్ణయాలను తీసుకుని ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురైందన్నారు. ఇవే విధానాలను కొనసాగిస్తే కూటమి ప్రభుత్వం కూడా ఉపాధ్యాయుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న తెలుగుదేశం ప్రభుత్వంలో తెలుగు మీడియంలో బోధన లేకపోవడం శోచనీయమన్నారు.

మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రపంచ బ్యాంకుతో గత ప్రభుత్వం సాల్ట్ పథకంలో భాగంగా చేసుకున్న ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం యథాతథంగా కొనసాగిస్తోందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జిఓ 117ను వ్యతిరేకించిన టిడిపి, ఇప్పుడు అదే విధానాలను అమలు చేసేందుకు పూనుకుందన్నారు. ప్రభుత్వ విద్యను ప్రైవేటుపరం చేసేందుకు ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. తెలుగు మీడియం లేకుండా పాఠశాల వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్కరణల వల్ల రాష్ట్రంలో 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లారని, సుమారు 12 వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా అవే సంస్కరణలను కూటమి ప్రభుత్వం దొడ్డిదారిన అమలు చేసేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. విద్యా వ్యవస్థలోని సమస్యలపై చర్చించేందుకు ఆ శాఖ మంత్రి నారా లోకేష్ సమయం కేటాయించడం లేదన్నారు. డైరెక్టర్‌తో చర్చల అనంతరం యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. జిఓ రద్దయిన తరువాతనే ఉపాధ్యాయుల సంఖ్య, విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవాలని విద్యాశాఖ ప్రతివారం నిర్వహించిన చర్చల్లో తాము కోరామన్నారు. తమ డిమాండ్లను విద్యాశాఖ పట్టించుకోకుండానే జిఓ 20, 21లను తీసుకొచ్చిందన్నారు. ఉన్నత పాఠశాలల్లోని తరగతి గదులు 45 మంది విద్యార్థులకే సరిపోతుందని, ప్రభుత్వం మాత్రం 53 మందిని ఉంచుతుందన్నారు. 45 దగ్గర రెండో సెక్షన్ ఇచ్చి సమాంతర మాధ్యమం కొనసాగించాలని కోరారు. బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45 దాటితే మూడో టీచర్ పోస్టు కేటాయించాలని కోరారు. ఫౌండేషన్ పాఠశాలల్లో ఇద్దరు టీచర్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్‌కు గురయ్యే ఉపాధ్యాయులకు బదిలీల్లో అదనపు పాయింట్లు ఇవ్వాలని కోరారు. బదిలీల్లో ఎస్‌జిటిలకు కౌన్సెలింగ్ ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ ఇవ్వకపోతే తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకునేందుకు యుటిఎఫ్‌గా తాము ప్రయత్నిస్తామని, ప్రపంచ బ్యాంకు సంస్కరణలు రద్దయ్యే వరకు అన్ని ఉపాధ్యాయ సంఘాలను, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసరావు, సహాధ్యక్షులు ఎన్ కుసుమకుమారి, కె సురేష్‌కుమార్, కార్యదర్శి ఎస్‌పి మనోహర్, ఉమామహేశ్వరావు, మురళీమోహన్, రాజేంద్ర, ఎన్ అరుణకుమారి, బి సుభాషిణి, ఎస్ కిశోర్‌కుమార్, జ్యోతిబాసు, జివి రమణ, కోశాధికారి ఆర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్బంధాన్ని ఖండించిన ఐద్వా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అందాల పోటీలను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలియజేసిన మహిళా సంఘాల నేతలపై పోలీసులు చేపట్టిన నిర్బంధ చర్యలను అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి గురువారం ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న అందాల పోటీల్లో పాల్గొంటున్న మహిళల పాదాలను వెండి పళ్లాల్లో పెట్టి ఇతర మహిళలతో కడిగించడం దారుణమైన చర్య అని, ఇది మహిళల ఆత్మగౌరవానికి చెరగని మచ్చగా పేర్కొన్నారు. ఇలాంటి అకృత్యాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. మహిళ శరీరాన్ని వస్తువులుగా మార్చి లాభాలు గడించాలనే దురుద్దేశంతో జరుగుతున్న ఈ కార్యక్రమాలు మహిళల గౌరవాన్ని, సమానత్వాన్ని కించ పరుస్తున్నాయని తెలిపారు. మహిళలపై హింసకు దారితీసే పరిస్థితులను సృష్టిస్తున్నాయన్నారు. మహిళా సంఘాల నేతల అక్రమ నిర్బంధానికి పాల్పడ్డ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ ప్రాంతంలో.. వంద శాతం రిజర్వేషన్‌పై

ప్రత్యేక చట్టం ప్రకటన పట్ల హర్షం

- ముఖ్యమంత్రికి రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్రంలో ఆదివాసీ ప్రాంతాల్లో, షెడ్యూల్డ్ గ్రామాలలో అధ్యాపకుల పోస్టుల విషయంలో ఆదివాసీలకు వంద శాతం రిజర్వేషన్ కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెడుతున్నట్టు చేసిన ప్రకటనను ఆదివాసీ ప్రజలు హర్షిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ పూర్వ కమిషనర్, కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్.శర్మ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. ఆ వివరాలను గురువారం మీడియాకు వెల్లడించారు. తన ఉద్దేశంలో ఆదివాసీల సంక్షేమానికి పై నిర్ణయం మంచిదని అభిప్రాయపడ్డారు. అధ్యాపకుల పోస్టుల రిజర్వేషన్‌లో ఎన్‌టి రామారావు ప్రభుత్వం జిఒ ఎంఎస్ 275ను 1986 నవంబర్ 2న జారీ చేసిందన్నారు. అయితే కొంతమంది గిరిజనేతరులు అందుకు వ్యతిరేకంగా హైకోర్టును, అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారన్నారు. కోర్టు, ట్రిబ్యునల్‌ల ఆదేశాలను దృష్టిలో పెట్టుకుని ఆదివాసీ రిజర్వేషన్లను పరిరక్షించే ఉద్దేశంతో ప్రభుత్వం జిఒఎంఎస్ 3ని 2000 జనవరి 10న జారీ చేసిందన్నారు. ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా గిరిజనేతరులు మళ్ళీ హైకోర్టును, తదుపరి సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలిపారు. రాష్ట్రం జారీ చేసిన జిఒఎంఎస్ 3 రాజ్యాంగంలోని 14, 16 ఆర్టికల్‌కు వ్యతిరేకంగా ఉందని, ఏ పరిస్థితిలో రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని ఉల్లంఘించకూడదని 2020 ఏప్రిల్ 22న సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐదో షెడ్యూల్ ద్వారా ఆదివాసీల ప్రత్యేక హక్కుల పరిరక్షణ ప్రాముఖ్యతను విపులంగా వాదించి ఉంటే కోర్టు ఆ విధంగా తీర్పు ఇచ్చి ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. సుప్రీంతీర్పు తరువాత తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ఐదో పేరా కింద ప్రత్యేకమైన చట్టాలను తక్షణం ప్రవేశపెట్టి, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీలకు వంద శాతం రిజర్వేషన్లకు చట్టపరంగా పరిరక్షణ కల్పించాలని తాను విజ్ఞప్తి చేశానన్నారు. తదుపరి రెండు తెలుగు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో రివిజన్ పిటిషన్లు దాఖలు చేశాయన్నారు. కానీ వారు సరైన చర్యలు తీసుకోకపోవడం కారణంగా కోర్టు రివిజన్ పిటిషన్లను తిరస్కరించిందన్నారు. అప్పటి ప్రభుత్వ న్యాయనిపుణులు ఐదో షెడ్యూల్ పేరా 5(2) కింద ముసా యిదా చట్టాలను తయారు చేశారన్నారు. ఆ సందర్భంలో ఎపి అడ్వకేట్ జనరల్ తనను కూడా సంప్రదించారన్నారు. కానీ తాను పదేపదే రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినా వారు ఏ కారణం వల్లనో ఆ దిశలో ముందుకు పోలేదన్నారు. అలాగే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో తాను ఆదివాసీల రిజర్వేషన్లపై గత ఏడాది రాసిన లేఖను శర్మ గుర్తుచేశారు.

విజయవాడ మెట్రోకు రూ.11,009 కోట్లు

- భూ సేకరణకు రూ.1,152 కోట్లు
- ప్రాథమిక నివేదికలు సిద్ధం
- త్వరలో డిపిఆర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాజధాని అమరావతిలో భాగంగా ఏర్పాటు చేయనున్న లైట్ మెట్రోకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. రెండు దశల్లో ఏర్పాటు చేయనున్న ఈ ప్రాజెక్టుకు మొదటి దశకు రూ.11,009 కోట్లు, భూ సేకరణకు రూ.1,152 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసింది. దీనికి సంబంధించి డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారీ బాధ్యతను శిస్ట్రా కన్సల్టెన్సీకి అప్పగించింది. కంపెనీ ప్రాథమిక నివేదికను మెట్రో రైల్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిసింది. విభజన హామీల్లో భాగంగా కేంద్రం అమరావతికి రైల్ కనెక్టివిటీ అవకాశం కల్పించింది. దీనిలో భాగంగా ఎర్రుపాలెం-నంబూరు మధ్య రైల్వేలైన్‌కు అనుమతులూ వచ్చాయి. అదే సమయంలో విజయవాడ నుండి రాజధాని అమరావతికి లైట్ మెట్రోను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విజయవాడలో లైట్ మెట్రో (ట్రామ్ తరహా రవాణా)ను రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో రెండు భాగాలుగా నిర్మించనున్నారు. మొదటి భాగం (1ఎ)లో విజయవాడ నుండి గన్నవరం, రెండో భాగం(1బి)లో విజయవాడ నుండి పెనమలూరు వరకూ 38.40 కిలోమీటర్లు నిర్మించనున్నారు. రెండో దశలో విజయవాడ నుండి అమరావతిలోని నీరుకొండ రిజర్వాయర్ వరకూ 27.75 కిలోమీటర్లు ఎల్ఆర్‌టి (లైట్ మెట్రో ట్రాన్సిట్) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతానికి మొదటి దశకు మాత్రమే డిపిఆర్ సిద్ధం చేశారు. ఈ మేరకు రుణ సమీకరణకూ మెట్రో చర్చలు జరుపుతోంది. విజయవాడ నుండి గన్నవరం వరకూ ఏర్పాటు చేయనున్న రైల్వేలైన్‌లో 23 కిలోమీటర్లు ఎలివేటెడ్ కారిడార్, 2.9 కిలోమీటర్లు అండర్‌గ్రౌండ్ కారిడార్ మొత్తం 25.9 కిలోమీటర్లు, రెండోదశలో పెనులూరు లైన్లో 12.5 కిలోమీటర్లు పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మించనున్నారు. మొత్తం రెండు రూట్లలో 33 స్టేషన్లు ఉండనున్నాయి. గన్నవరం రూట్లో ఒకచోట అండర్‌గ్రౌండ్ స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదన ఉంది. వీలైనంత త్వరలో పనులు ప్రారంభం అవుతాయని, కేంద్రం నుండి అనుమతులు వస్తాయని మెట్రో కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

విశాఖలో రూ.14,309 కోట్లు

విశాఖపట్నంలోనూ నాలుగు కారిడార్లలో మెట్రో ఏర్పాటు చేయనున్నారు. దీనిలో ప్రభుత్వ వాటా 40 శాతం, ప్రైవేటు డెవలపర్ వాటా 60 శాతం ఉండేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మొత్తం 76.90 కిలోమీటర్ల ప్రాజెక్టుకు రూ.14,309 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. దీనిలోనూ మొదటి మూడు కారిడార్లు 46.23 కిలోమీటర్లు నిర్మించనున్నారు. దీనికి రూ.11,498 కోట్లు అంచనాలేసి ప్రభుత్వానికి పంపగా ఆమోదం లభించింది. దీనిపై ఉత్తర్వులూ విడుదల చేశారు. దీనిలో మొదటి కారిడార్లో స్టీల్ ప్లాంటు నుండి కొమ్మాది వరకూ 34.40 కిలోమీటర్లు, గురుద్వారా నుండి ఓల్డ్ పోస్టాఫీసు వరకూ 5.08 కిలోమీటర్లు, తాటిచెట్లపాలెం నుండి చిన్నవాల్తేర్ వరకూ 6.75 కిలోమీటర్లు నిర్మించనున్నారు. సవరించిన అంచనాలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో రుణాల కోసం సంప్రదింపులు జరుపుతున్నారు. ఎఐఐబి ముందుకు రావడంతో త్వరలోనే ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయి. రెండోదశలో నాలుగో కారిడార్ కొమ్మాది నుండి భోగాపురం వరకూ 30.67 కిలోమీటర్లు నిర్మించనున్నారు. ప్రస్తుతం మొదటి మూడు కారిడార్లను పట్టాలెక్కించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో సేకరించాల్సిన భూమి విలువ అదనంగా ఉంది.

21 వరకూ బిడ్ల గడువు పొడిగింపు

విశాఖపట్నం, విజయవాడలో డబుల్ డెక్కర్ తరహాలో నిర్మించనున్న నాలుగు లైన్ల ఫ్లైఓవర్ మెట్రో లైను ఏర్పాట్లకు సంబంధించి డిపిఆర్ తయారీకి అవసరమైన కన్సల్టెంట్ల నియామక బిడ్ల సమర్పణ గడువు బుధవారంతో ముగిసింది. దీంతో ఈ నెల 21వ తేదీ వరకూ అర్హత ఉన్న కన్సల్టెంట్లు బిడ్లను సమర్పించవచ్చని గడువును పొడిగించారు.

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



టిజివిఎస్ఆర్ఎఎసి ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమ విస్తరణలో భాగంగా పాలిటెట్రాఫ్లోరో ఇథియం రసాయనం తయారు చేయడానికి అప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి వెళ్లిన ప్రజాసంఘాల నాయకులపై రాజ్యసభ మాజీ సభ్యులు, బిజెపి నేత టిజి వెంకటేష్ గూండాలు జరిపిన దాడిని ఖండిస్తూ, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యూజీ శ్రీనివాసులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్పతో పాటు ఎస్‌యుసిఐ, ఎఐకెఎస్, రైతు కూలీ సంఘం, విద్యావంతుల వేదిక, పౌర హక్కుల సంఘం, పిడిపి, కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. తన కుమారుడు, ప్రస్తుత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ అండతో ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణను నాలుగు వేల మంది గూండాల మధ్య టిజి వెంకటేష్ చేపట్టారని విమర్శించారు. దౌర్జన్యం చేస్తున్న వారిని నిలువరించలేని ఆర్‌డిఒపై చర్యలు తీసుకోవాలని కోరారు. విష రసాయనాల ప్రభావానికి సంబంధించి శాస్త్రవేత్తల బృందంచే విచారణ చేయించి ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలను, పర్యావరణాన్ని రక్షించుకోవడం కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

త్వరలో సర్క్యులర్ ఎకానమీ పాలసీ

- రాజస్థాన్ మోడల్ పరిశీలన
- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యర్థాల సమగ్ర నిర్వహణకు రాష్ట్రంలో సర్క్యులర్ ఎకానమీ పాలసీని త్వరలో రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ విధానంలో ముందున్న రాజస్థాన్ మోడల్‌ను పరిశీలించిన అధికారులకు సూచించారు. సచివాలయంలో సర్క్యులర్ ఎకానమీపై గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. వ్యర్థాలను సరైన విధానంలో నిర్వహించి అన్ని గ్రామాలనూ స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణను వేగవంతం చేయాలన్నారు. ప్రతిరోజూ ఇళ్ల నుంచి సేకరించే తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చేలా, పొడి చెత్తను ఏజెన్సీలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ఏజెన్సీలను ఆహ్వానించేందుకు వచ్చే నెలలో టెండర్లు పిలవాలని అధికారులకు సూచించారు. తడిచెత్తను ఎక్కడికక్కడే ఎరువుగా మార్చేలా డ్వాక్రా మహిళలకు బాధ్యతలు అప్పగించాలని చెప్పారు. ప్రతి మండల కేంద్రంలోనూ, జిల్లాకు రెండు చొప్పున మొత్తం 52 క్లస్టర్లు ఏర్పాటు చేసి, చెత్తను గ్రేడింగ్ చేసి దానిని కావాల్సిన ఏజెన్సీలకు విక్రయించడం, లేనిపక్షంలో తరలించడం చేయాలని సూచించారు. ఏ పంచాయతీలోనూ చెత్తను రోడ్లపై వేయడానికి వీల్లేదని పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించిన పంచాయతీలకు, వ్యక్తులకు అక్టోబరు 2న అవార్డులు అందించాలని సూచించారు. 2026 అక్టోబరు 2 నాటికి మొత్తం వ్యవస్థ గాడిలో పడాలని ఆదేశించారు. జీరో వేస్ట్ అనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో అమలు చేసేలా యాక్షన్ ప్లాన్ తయారుచేయాలన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలితో పంచాయతీరాజ్‌శాఖ సమన్వయం చేసుకోవాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలను ఏర్పాటుచేసి చెత్తను సేకరించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ వ్యర్థాలతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాల్లో వచ్చే వ్యర్థాలు సర్క్యులర్ ఎకానమీకి దోహదం చేసేలా అధ్యయనం జరగాలని కోరారు.



అనంతపురం ప్రజాశక్తి కాలనీలో నీటమునిగిన కాలనీవాసులను బయటకు తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

'అనంత'లో భారీ వర్షం

- నీట మునిగిన కాలనీలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా కేంద్రంతోపాటు, సమీప గ్రామాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి అనంతపురం నగర శివారులోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. ప్రజాశక్తి నగర్, సిపిఐ కాలనీ, కక్కలపల్లి ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. కట్టుబట్టలతో జనం బయటకు రావాల్సి వచ్చింది. నీటిలో చిక్కుకున్న పిల్లలు, వృద్ధులను అగ్నిమాపిక సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. అత్యధికంగా రాప్తాడు మండలంలో 141.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఇంత పెద్దఎత్తున వర్షం పడడంతో రాప్తాడు దిగువ భాగంలో ఉన్న గంగులకుంట, జంగాపల్లి చెరువులు నిండి కిందకు ప్రవహించాయి. పండమేరు వాగులు నీటితో ప్రవహించింది. సిపిఐ కాలనీలోకి నీరు చేరడంతో ఇళ్లలోని నిత్యావసరాలన్నీ నీటిలో మునిగాయి. లేపాక్షి కాలనీలోకి నీరు చేరి జలమయంగా మారింది. కక్కలపల్లి, ప్రజాశక్తి కాలనీలకు ఆనుకుని ఉన్న ప్రజాశక్తి నగర్‌లో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. సమాచారం తెలిసిన వెంటనే రెవెన్యూ, విద్యుత్ శాఖలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. ఇళ్లలోకి నీరు చేరిన వారికి భోజన వసతిని కల్పించారు. అనంతపురం జిల్లాలో అత్యధికంగా రాప్తాడు మండలంలో 141.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. కళ్యాణదుర్గంలో 53.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లా వ్యాప్తంగా 16.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదయింది.

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా మున్సిపల్ కార్మికులకు జీతాలు

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు జిఓ 1615 ప్రకారం 12వ పిఆర్‌సి నుంచి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, డిఎ, ఐఆర్ చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ మంత్రి నారాయణ, ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ బాబు, సిడిఎంఎ సంపత్ కుమార్‌కు, ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు వినతిపత్రాలను మెయిల్, వాట్సాప్‌లో గురువారం పంపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అమలవుతున్న విధంగా జీతాలు చెల్లించారని, విభజన అనంతరం 10, 11వ పిఆర్‌సి పేర్కొన్న విధంగా మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాబట్టి జిఓ 1615 ప్రకారం మున్సిపల్ కార్మికులకు 12వ పిఆర్‌సి నుంచి జీతాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెరిగిన మేరకు మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు డిఎతో కూడిన జీతాలు, మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. టెక్నికల్ విభాగాల్లో పనిచేస్తున్న వారికి అందుకు తగ్గట్టుగా జీతాలు ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రి, ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

'ఉక్కు'పై కేంద్రం వెంటనే స్పందించాలి

- పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1554వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు, స్టీల్‌ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరగకుండా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. పోరాట కమిటీ మరో చైర్మన్ డి ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విషయంలో మోడీ సర్కారు పూర్తి చొరవ తీసుకొని పూర్తి స్థాయి ఉత్పత్తికి సహకరించాలని కోరారు. సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి నాగభూషణం, నీరుకొండ రామచంద్రరావు, బిఎస్ రాజు, జివి సుబ్బయ్య, అవతారం, సుబ్బారావు, కె రవి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితునికి ఉరిశిక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం ఎల్.బి మార్కెట్ సమీపంలో రెండేళ్ల క్రితం మహిళను హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు తన్నీరు అంకమ్మరావుకు.. ఉరిశిక్ష విధిస్తూ 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి నేతి సత్య శ్రీ గురువారం తీర్పు వెలువరించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సిసిటివి ఫుటేజ్‌ను పరిశీలించగా ఎస్.ఆర్.కె.టి కాలనీకి చెందిన షేక్ సలీమా (52)ను అంకమ్మ రావు హత్య చేసినట్లు గమనించారు. విచారణలో నేరం రుజువు కావడంతో ఉరిశిక్ష విధించాలని న్యాయస్థానం తీర్పు వెలువరించింది. నిందితుడు మరో రెండు హత్య కేసుల్లో ఇప్పటికే జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు.

తెలుగు మీడియాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వంలో రద్దు చేసిన తెలుగు మీడియాన్ని కనీసం ప్రాథమిక స్థాయిలోనైనా పునరుద్ధరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. లేదంటే డ్రాపౌట్స్ పెరిగే పరిస్థితి ఉందని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామశెట్టి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బదిలీల్లో ప్రిఫరెన్షియల్ ఉపాధ్యాయులకు అన్ని ఖాళీ స్థానాలు కోరుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. లేదంటే వారికి ఆ పాయింట్స్ ఇవ్వడంలో అర్థం లేదని పేర్కొన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి సవరణ చేసి నాణ్యమైన విద్య అందించాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి నిమ్మల తదితరులు

ఘనంగా కాటన్ జయంతి

- నివాళులర్పించిన మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు (పశ్చిమగోదావరి)

సర్ ఆర్థర్ కాటన్ జయంతిని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో గురువారం ఘనంగా నిర్వహించారు. సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో కాటన్ విగ్రహానికి రైతులతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాటన్ ముందు చూపుతో ధవళేశ్వరం ఆనకట్టతోపాటు ఉభయగోదావరి జిల్లాల్లో కాలువల నిర్మాణానికి కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు. జగన్ ఐదేళ్ల పాలనలో పోలవరం ప్రాజెక్టుతోపాటు ఇరిగేషన్ వ్యవస్థను ధ్వంసం చేశారన్నారు. నదుల అనుసంధానం చేసి రాష్ట్రంలో కరువు లేకుండా చేయాలని సిఎం చంద్రబాబు శ్రమిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పంట కాలవలు, మురుగు డ్రెయిన్ల మెయింటినెన్స్ పనులకు రూ.344 కోట్లు కేటాయించామని తెలిపారు.

బాలాజీ వెంకటేశ్వర మందిర్ తొలగింపుపై స్టేటస్ కో

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ఎపి భవన్ ప్రాంగణంలో ఉన్న బాలాజీ వెంకటేశ్వర మందిర్ తొలగింపుపై స్టేటస్ కోను ఢిల్లీ హైకోర్టు విధించింది. ఢిల్లీలోని ఎపి భవన్ వెనుక భాగంలో ఉన్న బాలాజీ వెంకటేశ్వర మందిర్ ఆక్రమణలో ఉందని ఎపి భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ ఖాళీ చేయించే ప్రయత్నం చేశారు. అయితే శివ, బాలాజీ, వెంకటేశ్వర మందిర్ పూజారి గోపాల్ కుమార్ మిశ్రా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

గురువారం దీనిపై విచారణ జరిపిన జస్టిస్ సచిన్ దత్తా ఈ నెల 19 వరకు ఎలాంటి చర్యలు చేపట్టొద్దని ఆదేశించారు. యథాతథ స్థితి (స్టేటస్ కో)ని కొనసాగించాలని, ప్రతివాదులకు నోటీసులిచ్చారు. అంతవరకూ విద్యుత్, నీటి సరఫరా కూడా కొనసాగించాలని ఆదేశించారు.

కదంతొక్కిన కోకో రైతులు

- మోండలీజ్ కంపెనీ కార్యాలయం ఎదుట మహాధర్నా
- మద్దతు పలికిన రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్
- 17 నుంచి కంపెనీ కార్యాలయాలు, గొడౌన్ల ఎదుట రిలే దీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ, దెందులూరు

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాల్సిందే అంటూ కోకో రైతులు కదం తొక్కారు. గురువారం ఏలూరు సమీపంలోని సోమవరప్పాడు జాతీయ రహదారి వద్ద మోండలీజ్ కంపెనీ ఆఫీసు, గొడౌన్ వద్ద ఎపి కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ధర్నాకు రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గత సంవత్సరం వరకు అంతర్జాతీయ మార్కెట్ ధర అమలు చేసిన కంపెనీలు ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ... రైతులను కంపెనీలు మోసగించినా, అవమానించినా సహించేది లేదన్నారు. రోజురోజుకీ ధరలు ఎందుకు తగ్గిస్తున్నారో, రైతుల నుండి కోకో గింజలు ఎందుకు కొనుగోలు చేయడం లేదో చెప్పాలని కోరారు. కోకో గింజల కొనుగోలు, ధర సమస్యపై వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడుతో ఫోన్లో సంప్రదించగా రెండు, మూడు రోజుల్లో కంపెనీలు, రైతులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారన్నారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ.. విదేశీ కోకో గింజల దిగుమతులు వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కిలోకు రూ.800లకు ధర ఇవ్వాలని కోరారు.



మోండలీజ్ కంపెనీ కార్యాలయం ఎదుట కోకో రైతుల ధర్నా

కంపెనీ ప్రతినిధులతో చర్చలు

ఎబి.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమక్షంలో మోండలీజ్ కంపెనీ మేనేజర్ రాజేష్ రామచంద్రన్ చర్చలు జరిపారు. రైతుల వద్ద ఉన్న గింజలు కొనుగోలు చేస్తామని, రైతులకు క్షమాపణ చెబుతున్నామని, అయితే ధర పెంచలేమని మేనేజర్ చెప్పడంతో చర్చలు అసంతృప్తిగా, అసంపూర్ణంగా ముగిశాయి.


24 గంటల్లో సమాధానం చెప్పకపోతే ఉద్యమం తీవ్రతరం

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చేలా కంపెనీలు తగిన నిర్ణయం తెలియజేయకపోతే అన్ని కంపెనీల గొడౌన్ల ముందు రిలే దీక్షలు చేపట్టి కంపెనీల కార్యకలాపాలు స్తంభింపజేస్తామని, ఈ నెల 17 నుంచి కోకో గింజల కొనుగోలు కంపెనీలు, ట్రేడర్ల గొడౌన్ల ముందు రిలే దీక్షలు చేపడుతున్నట్లు సంఘం నేతలు ప్రకటించారు. ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఏలూరు జిల్లాతోపాటు పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల నుండి పెద్దసంఖ్యలో కోకో రైతులు తరలొచ్చారు.

జూన్ నుంచి హాస్టళ్లకు సన్న బియ్యం : మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జూన్ నుంచి అన్ని వసతి గృహాలకు సన్నబియ్యం అందించనున్నట్లు బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బిసి వసతి గృహాలు, గురుకులాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను ఆమె గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తల్లికి వందనం పథకాన్ని జూన్‌లో అమలు చేయనున్నట్లు తెలిపారు. బిసి వసతి గృహాల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 109 గురుకులాల్లో 108 టిడిపి హయాంలో ఏర్పాటుచేసినవేనన్నారు. మరిన్ని గురుకులాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బిసి యువతకు సివిల్ సర్వీసుల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు మెగా డిఎస్‌సికి అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. విదేశీ విద్యను అందిస్తామన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌ను అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. ఎక్కువ సమయాన్ని విద్యాభ్యాసానికి వెచ్చించాలన్నారు. తొలుత మహాత్మా జ్యోతిరావు పూలే, దేశ రక్షణకు ప్రాణాలర్పించిన మురళీ నాయక్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళు లర్పించారు.



అన్ని విధాలా అండగా ఉంటా..

- వీరయ్యచౌదరి కుటుంబానికి లోకేష్ పరామర్శ

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు (ప్రకాశం జిల్లా)

ఇటీవల ఒంగోలులో దారుణహత్యకు గురైన టిడిపి నేత ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్యచౌదరి కుటుంబ సభ్యులను రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



వీరయ్యచౌదరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి లోకేష్

లోకేష్‌ను కలిసిన పొగాకు రైతులు

పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ అమ్మనబ్రోలుకు చెందిన పలువురు పొగాకు రైతులు మంత్రి లోకేష్‌ను కోరారు. ఆయన వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఫోన్ చేసి.. పొగాకు రైతుల సమస్యను పరిష్కరించాలన్నారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కిన పొగాకు రైతన్నలు

- ఆగి.. సాగిన వేలం

ప్రజాశక్తి- కొండపి (ప్రకాశం జిల్లా)/ అమరావతిబ్యూరో

గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రకాశం జిల్లా కొండపి-టంగుటూరు రోడ్డులో పొగాకు రైతులు రాస్తారోకో చేశారు. వేలం నిర్వహణలో పాల్గొనబోమని చెప్పి గ్రామాలకు తిరిగి వెళ్లిపోయారు కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో గురువారం నేతివారిపాలెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు 1,210 బేళ్లను వేలానికి తీసుకొని వచ్చారు. వేలం ప్రారంభం నుంచి పొగాకు ధరలను తగ్గిస్తూ, మంచి గ్రేడ్ పొగాకును కూడా తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో 17 బేళ్ల వేలం పూర్తయిన తర్వాత రైతులు వేలాన్ని బహిష్కరించారు. పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలని గిట్టుబాటు ధర కల్పించే వరకు వేలంలో పాల్గొనబోమని వేలం నిర్వహణ అధికారి సునీల్‌కుమార్‌తో రైతులు తేల్చి చెప్పారు. అనంతరం రైతులు కొండపి-టంగుటూరు రోడ్డులో రాస్తారోకో చేశారు.

వేలం నిర్వహణ అధికారి కూడా రైతుల పక్షాన నిలిచి వ్యాపారులతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కొనుగోలు చేయాలని నినాదాలు చేశారు. వేలం ప్రారంభంలో ఎఫ్-2 రకం బేళ్లు కేజీ ధర రూ.280 పలకగా.. తరువాత రూ.250 నుంచి రూ.270 పలుకుతోందని చెప్పారు. ఎఫ్-3 బేళ్లు మొదట్లో రూ.250 పలికి తర్వాత రూ.210 వేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకో అనంతరం రైతులు తమ గ్రామాలకు వెళ్లిపోయారు. దీంతో వేలం నిర్వహణ అధికారి జి సునీల్‌కుమార్, కొండపి బోర్డు పొగాకు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు భాస్కర్, పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య గ్రామానికి వెళ్లి రైతులతో చర్చించారు. పొగాకు మద్దతు ధరతో కొనుగోలు చేసే విధంగా వ్యాపారులతో మాట్లాడి మంచి ధర పలికే విధంగా చూస్తానని హామీ ఇవ్వడంతో రైతులు తిరిగి వేలం కేంద్రానికి వచ్చారు. రైతులు తిరిగి రావడంతో వేలాన్ని ప్రారంభించారు. తొలుత పలికన ధర కన్నా అధికంగా ధర చెల్లించారు.

ఆందోళన వద్దు: అచ్చెన్నాయుడు

తెల్ల, నల్ల బర్లి పొగాకు పండించే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. సదరు పొగాకును తక్షణమే కొనుగోలు చేయడానికి పొగాకు కంపెనీలు ఐటిసి, జిపిఐ, డెక్కన్ టొబాకో, బిటిసి సంస్థల యాజమాన్యాలతో చర్చలు జరిపినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా సంస్థలకు పొగాకు కొనుగోలు విషయంపై స్పష్టమైన ఆదేశాలిచ్చామని తెలిపారు. జిపిఐ సంస్థ గురువారం నుంచే పొగాకు కొనుగోళ్లు ప్రారంభించిందని పేర్కొన్నారు. అలాగే బర్లి పొగాకునూ కొనుగోలు చేయడానికి కేంద్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాశారన్నారు.

18న 'నిఘా'ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

భారతదేశ భద్రతే లక్ష్యంగా ఇస్రో మరో నిఘా ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈ నెల 18న శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం మొదటి ప్రయోగ వేదిక నుంచి ఇఒఎస్09 ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. దేశానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన పోలార్ సాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి) ద్వారా ఈ ఉపగ్రహ ప్రయోగం జరుపుతున్నారు. పిఎస్ఎల్వి -సి 61 పేరుతో రాకెట్‌ను నాలుగు దశలుగా నిర్మించారు.

ఇఒఎస్-09 పేరుతో ప్రయోగిస్తున్న ఉపగ్రహం భూ పరిశీలన ఉపగ్రహం కూడా అత్యంత శక్తివంతంగా, సరిహద్దు ప్రాంతాలను అందులో ఉగ్రవాద కదలికలను పసిగట్టే సామర్థ్యం కలిగి ఉందని ఇస్రో వర్గాలు పేర్కొన్నాయి. దేశ భద్రత కోసం దేశంలోని 7 వేల కిలోమీటర్ల సువిశాల సముద్ర తీర ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అత్యాధునిక ఉపగ్రహాల డ్రోన్ల సాంకేతిక పరిజ్ఞానం లేకపోతే.. అనేక వ్యూహాత్మక లక్ష్యాలను మనం చేరుకోలేమని ఇస్రో చైర్మన్ నారాయణ ఇప్పటికే స్పష్టం చేశారు. ఇఒఎస్-09 ఉపగ్రహం రీషాట్ 1బి సేవలు అందించనుంది. ఈ ఉపగ్రహ ప్రయోగ ప్రాధాన్యత దృష్ట్యా మరి కొంతమంది విఐపిలు ఇస్రో చైర్మన్‌తో పాటు ఇతర సీనియర్ శాస్త్రవేత్తలు రాకెట్ ప్రయోగ సమయంలో షార్ లోనే ఉండబోతున్నారు.

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ/ఎస్‌జిటి

విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం: ప్రజ్ఞా పరీక్షలు



-కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083



ప్రజ్ఞ (ఇంటెలిజెన్స్)

ప్రజ్ఞ అంటే సాధారణంగా తెలివితేటలు. మన దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలన్నింటినీ వివేకంతో ఆలోచించి సమర్థవంతంగా పరిష్కరించుకోగలిగే సామర్థ్యమే.

నిర్వచనాలు

- ప్రయోజనాత్మకంగా పనిచేయటానికి, వివేకవంతంగా ఆలోచించటానికి చుట్టూ ఉన్న పరిసరాలతో సమర్థవంతంగా వ్యవహరించటానికి అవసరమయ్యే సామర్థ్యాన్నే ప్రజ్ఞగా అంటారు. **-వెష్లర్**
- వ్యక్తి యొక్క గ్రాహ్యక శక్తినే ప్రజ్ఞ అంటారు-గాల్టన్
- అమూర్తంగా ఆలోచించగలిగే సామర్థ్యాన్నే ప్రజ్ఞ అంటారు**-టెర్మన్**
- కచ్చితమైన దిశలో ఆలోచనలు చేయగలుగుతూ స్వీయవిమర్శ చేసుకోగలుగుతూ ప్రవర్తనను సర్దుబాటు చేసుకోగలిగే శక్తియే ప్రజ్ఞ**-బినే**
- భౌతిక, సామాజిక పరిసరాలకనుగుణ్యతను పొందగలిగే శక్తినే ప్రజ్ఞ అంటారు. **- పియాజే**
- పరస్పర సంబంధాలను చూడగలిగే అంతర్గత శక్తియే ప్రజ్ఞ- **స్పియర్మన్**
- కొత్త సమస్యలకు, పరిస్థితులకు అనుగుణ్యతను పొందే సామాన్య

మానసిక శక్తియే ప్రజ్ఞ-స్టెర్న్

- అభ్యసించే సామర్థ్యమే ప్రజ్ఞ**-డేర్బాన్**
- ప్రతీకాత్మక ప్రక్రియలను ఉపయోగించి వ్యక్తి సర్దుబాటు చేసుకొనే సామర్థ్యమే ప్రజ్ఞ**-ఎడ్వర్డ్**
- అభ్యసించటానికి దోహదపడే సామర్థ్యాల సంయుక్త నిర్వహణ ప్రజ్ఞ **-గేట్స్**
- సర్దుబాటు, సాంఘిక విలువలు, సృజనాత్మక లక్షణాలు గల కృత్యాలను చేసే వ్యక్తిలో గల సామర్థ్యమే ప్రజ్ఞ-స్తోడార్ట్

వివిధ నిర్వచనాల నుండి "ప్రజ్ఞ" అనేది:

1. ప్రయోజనాత్మకంగా పనిచేయగలిగే సామర్థ్యం.
2. వివేకవంతమైన ఆలోచనలు / హేతుబద్ధ ఆలోచనలు చేయగలిగే సామర్థ్యం.
3. విషయాలను అభ్యసించగలిగే సామర్థ్యం.
4. విషయాలను గ్రహించగలిగే లేదా అర్థం చేసుకోగలిగే సామర్థ్యం
5. అమూర్త ఆలోచనలు చేయగలిగే సామర్థ్యం
6. ఆలోచనలను ఖచ్చితమైన దిశలో లేదా ఒక క్రమ పద్ధతిలో కొనసాగించే సామర్థ్యం.
7. స్వీయ విమర్శ లేదా ఆత్మ విమర్శ చేసుకోగలిగే సామర్థ్యం.
8. పరిసరాల అనుగుణ్యత పొందే సామర్థ్యం
9. క్లిష్ట సమస్యలను పరిష్కరించుకోగలిగే సామర్థ్యం.
10. కొత్త పరిస్థితులకు అనుగుణ్యతను పొందే సామర్థ్యం.
11. అంశాల మధ్య పరస్పర సంబంధాలను చూడగలిగే సామర్థ్యం
12. సాంఘిక సంబంధాలను మెరుగుపరచుకోగలిగే సామర్థ్యం
13. భౌతికసూత్రాలను అర్థం చేసుకుని, యంత్రాలు, పరికరాలను, వస్తువులను సమర్థవంతంగా వినియోగించ గలిగే సామర్థ్యం.

ప్రజ్ఞలు కానివి:

1.జ్ఞానం, 2. సృజనాత్మకత, 3. సహజసామర్థ్యం, 4 స్మృతి

1.ప్రజ్ఞ-జ్ఞానం:

- ప్రజ్ఞ అనేది పుట్టుకతోనే అనువంశికంగా సంక్రమించే ఒక అంతర్గతమైన మానసిక శక్తి.
- జ్ఞానం అనేది పుట్టిన తర్వాత అనుభవాల ద్వారా లేదా అభ్యసించటం ద్వారా గ్రహించే సమాచారం.
- ప్రజ్ఞ ద్వారా జ్ఞానాన్ని మెరుగుపరచుకోవచ్చు. కానీ జ్ఞానం ద్వారా ప్రజ్ఞను మెరుగుపర్చుకోలేము.

2. ప్రజ్ఞ-సజనాత్మకత:

- 'ప్రజ్ఞ అనేది వ్యక్తిలో సమైక్య ఆలోచన/ ఏకముఖ ఆలోచనను కలుగజేసి సమస్యకు ఒకే రకమైన పరిష్కార మార్గాన్ని అందించే సామర్థ్యం
- "సృజనాత్మకత" అనేది వ్యక్తిలో విభిన్న ఆలోచన/ బహుముఖ ఆలోచనను కలుగజేసి సమస్యకు ఒకటి కంటే ఎక్కువ వినూత్నమైన పరిష్కార మార్గాలను అందించే సామర్థ్యం.
- అధిక ప్రజ్ఞ కలిగిన వ్యక్తులందరికీ సృజనాత్మకత ఉండకపోవచ్చు. కానీ సృజనాత్మకత ఉన్న వారందరికీ అధిక ప్రజ్ఞ ఉంటుంది.
- ప్రజ్ఞకి సజనాత్మకతకి మధ్య సంబంధం నిర్దిష్టమైన సంబంధం లేదు.

3. ప్రజ్ఞ - సహజ సామర్థ్యం:

- ఇవి రెండూ వ్యక్తికి స్వతహాగా/సహజ సిద్ధంగా సంక్రమించే అంతర్గత మానసిక సామర్థ్యాలు.
- ఇందులో ప్రజ్ఞ అనేది అన్ని సామర్థ్యాల్లో సామాన్యకారకంగా పనిచేస్తూ ఆయా అంశాలపై సాధారణ అవగాహన కల్గించే సామర్థ్యం.
- "సహజ సామర్థ్యం" అనేది ఏదో ఒక రంగంలో నిర్దిష్టంగా రాణించడానికి తోడ్పడే ప్రత్యేకమైన జ్ఞానం, నైపుణ్యాలతో కూడిన సామర్థ్యం.
- ప్రజ్ఞను శిక్షణ ద్వారా మెరుగుపరచుకోలేం. కానీ సహజ సామర్థ్యాన్ని శిక్షణ ద్వారా మెరుగుపరచుకోవచ్చు.

4. ప్రజ్ఞ- స్మృతి:

- ప్రజ్ఞ, స్మృతులు రెండూ వ్యక్తికి పుట్టుకతోనే వచ్చే మానసిక శక్తులు.
- ప్రజ్ఞ అనేది వ్యక్తికి విషయాలను అవగాహన చేసుకుంటూ అభ్యసించగలిగే సామర్థ్యాన్ని ఇస్తుంది.

'స్మృతి' అనేది అభ్యసించిన వివరాలను ధారణలో కొద్ది కాలం పాటు నిల్వ చేసుకోగలుగుతుంది. అనగా స్మృతి సామర్థ్యం అభ్యసించిన విషయాలను జ్ఞప్తిలో ఉంచుకుంటుంది.

ప్రజ్ఞ- స్వభావం:

- ప్రజ్ఞ అనేది ప్రతి వ్యక్తికీ అనువంశికంగా సంక్రమించే ఒక మానసిక శక్తి.
- ప్రజ్ఞలో వికాసం అనేది వ్యక్తి పరిసరాలతో జరిపే ప్రతి చర్యలతో జరుగుతుంది.
- ప్రజ్ఞ వికాసం అనేది కౌమార దశ చివరికల్లా గరిష్ఠస్థాయికి చేరుతుంది.
- ప్రజ్ఞ సార్వత్రికమైంది. ప్రజ్ఞ అందరిలోనూ ఉంటుంది. దీనికి జాతి, మతం, కులం, ప్రాంతం, లింగం, భాషాబేధాలు ఉండవు.
- ప్రజ్ఞలో వైయక్తిక బేధాలు ఉంటాయి.
- ప్రజ్ఞను శిక్షణ ద్వారా మెరుగుపర్చుకోలేము.
- ప్రజ్ఞను ప్రజ్ఞా పరీక్షల ద్వారా నిర్ధిష్టంగా మాపనం చేయొచ్చు.

ప్రజ్ఞా మాపనులు:

- ప్రజ్ఞ అనేది అనేక మానసిక సామర్థ్యాల సమూహాం/సమ్మేళనం
- ప్రజ్ఞను మాపనం చేయటం అంటే వ్యక్తుల మానసిక సామర్థ్యాలను మాపనం చేయడమే.
- వ్యక్తి యొక్క ఆలోచన, వివేచన, సమస్యా పరిష్కార సామర్థ్యం, ప్రత్యక్షాత్మకత, భాషా అవగాహన మెదలైన వాటిని మానసిక సామర్థ్యాలు అంటారు.
- పై సామర్థ్యాలను కొలిచే విధంగా ప్రజ్ఞా పరీక్షల్లో ప్రశ్నలు శాబ్దిక, అశాబ్దిక రూపంలో ఉంటాయి.
- చదవుకునే పిల్లల్లో మందమతులు ఎందుకుంటారు అని తెలుసుకోవడానికి ఫ్రాన్స్ ప్రభుత్వం నియమించిన కమిషన్ పేరు - బినే సైమన్ కమీషన్
- మొట్టమొదటి ప్రజ్ఞా మాపని/పరీక్షని రూపొందించిన వారు-ఆల్ఫ్రెడ్ బినే (ఫ్రాన్స్)
- మొట్టమొదటి ప్రజ్ఞామాపని పేరు- బినే సైమన్ ప్రజ్ఞా మాపని
- మొట్టమొదటి ప్రజ్ఞా మాపని ప్రచురించబడిన సంవత్సరం-1905
- ప్రజ్ఞ వికాసం అనేది కౌనూర దశ చివరికల్లా గరిష్ఠస్థాయికి చేరుతుంది.
- ప్రజ్ఞామాపనుల పితామహుడు (ఫాదర్ ఆఫ్ ఇంటెలిజెన్స్ టెస్ట్స్) గా పిలువబడేవారు-అల్ఫ్రెడ్ బినే
- ప్రజ్ఞామాపన ఉద్యమ మూలపురుషుడు-అల్ఫ్రెడ్ బినే
- మానసిక వయస్సు అనే భావనను ప్రవేశపెట్టిన వారు-అల్ఫ్రెడ్ బినే


నోట్:

- ఒక పిల్లవాడిపై ప్రజ్ఞా పరీక్షలను ప్రయోగించినప్పుడు ఏ వయస్సు ప్రజ్ఞా పరీక్షలోని అన్ని అంశాలను పూర్తి చేయగలుగుతాడో దానిని ఆధార వయస్సుగా (బేసిక్ ఏజ్)గా తీసుకుంటారు.
- వయస్సుల పరీక్షల్లో ఒక్కొక్క అంశాన్ని రెండు నెలలుగా పరిగణిస్తారు. ఎన్ని అంశాలు పూర్తిచేస్తే అంశాల సంఖ్య X రెండుగా పరగణిస్తారు.

ప్రజ్ఞాలబ్ధి ఆధారంగా వ్యక్తుల వర్గీకరణ:

అమెరికాలోని స్టాన్ఫర్డ్ యూనివర్శిటీకి చెందిన ప్రముఖ సైకాలజిస్టు లూయిస్ టెర్మన్ తన సహోధ్యాయునిగా పనిచేసే మెర్రిల్ సహకారంతో తను రూపొందించిన స్టాన్ఫర్డ్ బినే సైమన్ ప్రజ్ఞామాపనిని అనేక వేల మందిపై ప్రయోగించి వచ్చిన గణాంకాలకు సాంఖ్యక విశ్లేషణ జరిపి దానినుండి ప్రజ్ఞాలబ్ది సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

-ఈ గణాంకాలకు గీసిన వక్రరేఖ సామాన్య సంభావ్యత వక్రరేఖ (ఎన్‌పిసి-నార్మల్ ప్రోబబిలిటీ కర్వ్)ను పోలివుంది



మీన్ మేడ్ మెడిన్

-దీని ఆధారంగా 'టెర్మన్' ప్రతిపాదించిన అంశాలు

1. ఇది గంటాకారాన్ని కల్గివుంది.
2. ఇది సౌష్టవాన్ని కల్గివుంది.
3. మధ్యబిందువు వద్ద "అంకమధ్యమం, మధ్యగతం, బాహుళకం"లు ఒకే సగటు విలువను కలిగి ఉన్నాయి.
4. ఈ రేఖ మధ్య ప్రాంతంలో అనగా "సగటు ప్రాంతంలో ఎక్కువ గణాంకాలు గుమిగూడి ఉన్నాయి. అనగా జనాభాలో సగటు ప్రజ్ఞావంతులు ఎక్కువ మంది ఉన్నారు అని అర్థం.

-మొట్టమొదటి టెర్మన్ వర్గీకరణలో "10 రకాల" ఐక్యూ ఆధారిత వర్గాలు ఉన్నాయి.

-ఆధునిక విద్యాపరమైన ఐక్యూ ఆధారిత వర్గీకరణలో 8 రకాల వర్గాలు మాత్రమే ఉన్నాయి.

ప్రజ్ఞా లబ్ధి:

1. 25 లోపు--రక్షణ స్థాయి బుద్ధి మాంధ్యులు/మూఢులు (అతితీవ్ర, తీవ్ర బుద్ధి మాంధ్యత)
2. 26-49--శిక్షణ స్థాయి బుద్ధిమాంధ్యులు/బుద్ధిహీనులు/టిఎంఆర్ (మిత బుద్ధిమాంధ్యత)
3. 50-69-- అభ్యసన స్థాయి బుద్ధి మాంధ్యులు/అల్పబుద్ధులు ప్రాథమిక విద్యా స్థాయి బుద్ధిమాంధ్యత /ఎల్ఎంఆర్(స్వల్ప బుద్ధి మాంధ్యత)
4. 70-89--నిదాన అభ్యాసకులు,తెలివి తక్కువ వారు
5. 90-109--సగటు ప్రజ్ఞావంతులు
6. 110-119 ఉన్నత ప్రజ్ఞావంతులు
7. 120-139 అత్యున్నత ప్రజ్ఞావంతులు
8. 140 పైన--ప్రతిభావంతులు.

నోట్ : టిఎంఆర్ :ట్రైనబుల్ మెంటల్లీ రిటార్డ్
ఎల్ఎంఆర్ : లెర్నబుల్ మెంటల్లీ రిటార్డ్

ప్రజ్ఞా లబ్ధి :

-ప్రజ్ఞా లబ్ధి అనే భావనను మొట్టమొదటిగా ప్రవేశపెట్టిన వారు -విలియం స్టెర్న్ (జర్మనీ)

-విలియం స్టెర్న్ ప్రకారం ప్రజ్ఞా లబ్ది అనేది- మానసిక వయస్సు, శారీరక వయస్సుల నిష్పత్తి

నోట్ :

ఐక్యూని గణించేటప్పుడు మానసిక వయస్సు, శారీరక వయస్సు ఒకే యూనిట్‌లో ఉండాలి. అంటే రెండు సంవత్సరాల్లో కానీ, రెండు నెలల్లో కానీ ఉండాలి.

-ఎంఎ అంటే మానసిక వయస్సు. దీనిని ప్రజ్ఞా పరీక్షల ద్వారా నిర్ణయిస్తారు.

-సిఎ అంటే శారీరక వయస్సు, యదార్థ వయస్సు, వాస్తవ వయస్సు, క్రమానుగత వయస్సు మానసిక వయస్సుని ప్రజ్ఞా పరీక్షల ద్వారా గణించే విధానం

ప్రజ్ఞామాపనులు- పరిణామక్రమం:

సంవత్సరం	ప్రజ్ఞా మాపని పేరు	ప్రజ్ఞా మాపని కర్త	ప్రశ్నల సంఖ్య	నిర్దేశిత వయస్సు
1905	బినే-సైమన్ ప్రజ్ఞా మాపని	ఆల్ఫ్రెడ్ బినే	30	3-13
1908	బినే-సైమన్ ప్రజ్ఞామాపని	ఆల్ఫ్రెడ్ బినే	59	3-13
1911	బినే సైమన్ ప్రజ్ఞా మాపని	ఆల్ఫ్రెడ్ బినే	54	3-13
1916	స్టాన్‌ఫర్డ్ బినే-సైమన్ ప్రజ్ఞామాపని	లూయిస్ టెర్మన్	90	3-14
1937	స్టాన్‌ఫర్డ్ బినే-సైమన్ ప్రజ్ఞామాపని	లూయిస్ టెర్మన్	129	2-14

(ఫాం-ఎం, ఫాం-ఎల్)

నోట్ : ప్రజ్ఞా పరీక్షల ద్వారా కొలిచే మానసిక సామర్థ్యాల ఆధారంగా నిర్ణయించబడే వయస్సును మానసిక వయస్సు అంటారు.

-1911లో ఆల్ఫ్రెడ్ బినే మరణించారు.

-స్టాన్‌ఫర్డ్ బినే సైమన్ ప్రజ్ఞామాపని 1960లో ఒకసారి, 1973లో 2 సార్లు రివైజ్ చేశాడు.

-చివరి రివైజ్డ్ ఎడిషన్-1978 - అత్యంత ప్రామాణికమైన ప్రజ్ఞాపరీక్షగా గుర్తింపు పొందింది. దీనిని 2-18 సం॥ల వ్యక్తుల ప్రజ్ఞను మాపనం చేసే విధంగా రూపొందించారు.

-టెర్మన్ వ్యక్తుల్లో ప్రతిభావంతులను గుర్తించడానికి అనేక వ్యక్తిగత, సామూహిక ప్రజ్ఞా పరీక్షలను రూపొందించాడు. అంటే ప్రతిభావంతులు, వరదత్తులను గుర్తించడానికి "ప్రజ్ఞాపరీక్షలను" ఉపయోగిస్తారు.

రేపు : ప్రజ్ఞా పరీక్షలు: ఉపయోగాలు

సంపాదకీయం


కష్టజీవుల ఉసురు

'కూలి కోసం.. కూటి కోసం పట్టణంలో బతుకుదామని ... బయలుదేరిన బాటసారికి ... ఎంత కష్టం ఎంత కష్టం' అన్న మహాకవి శ్రీశ్రీ ఆవేదన దాదాపు ప్రతిరోజూ రహదారుల మీద రక్తమోడే దృశ్యంగా కనిపిస్తూనే ఉంది. ఉన్న ఊళ్లో ఉపాధి దారి కనిపించక బతుకు తెరువుకు దూరప్రాంతాలకు తరలివెళ్లే కార్మికులు తరచూ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతుండడం అత్యంత విషాదకరం. ప్రతిరోజూ చిన్నదో పెద్దదో ప్రమాదం జరగడం, ఎక్కువ సందర్భాల్లో పొట్టకూటికి పనికి వెళ్లే కార్మికులే బలవ్వడం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. గత పది రోజుల్లో రాష్ట్రంలో దాదాపు 25 మంది పనికి వెళుతూనో, వస్తూనో ప్రమాదాలకు గురై, ప్రాణాలు కోల్పోయారు. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాల్లో ఇంటిని నడిపే మనిషి అర్ధాంతరంగా చనిపోతే– మిగిలిన ఆ ఇంటిల్లిపాది భవిష్యత్తూ అంధకార బంధురమే అవుతుంది. ప్రతి ఏటా దేశంలో లక్షలాది కుటుంబాలకు ఇలాంటి దుర్భర పరిస్థితి దాపురిస్తోంది. ప్రపంచంలోని వాహనాల్లో మనదేశంలో ఉన్నవి ఒక్క శాతం కాగా, వాహన ప్రమాదాల్లో చనిపోతున్న వారి సంఖ్య 11 శాతం. మన రోడ్డు భద్రతా వ్యవస్థలోని లోపాలను, ప్రమాణాల్లోని డొల్లతనాన్ని ఈ లెక్క వెల్లడి చేస్తోంది. ప్రమాద బాధితుల్లో పేదల, కార్మికుల సంఖ్య గ్రామాల్లో లభించని ఉపాధిని, రక్షణనివ్వలేని రవాణా వ్యవస్థని వేలెత్తి చూపుతోంది.

ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాద మరణాలు తగ్గుతుండగా, మన దేశంలో మాత్రం పెరుగుతున్నాయి. 108 దేశాల్లో రోడ్డు ప్రమాదాలు తగ్గాయని, భారతదేశంలో మాత్రం 15 శాతం పెరిగాయని ఐక్యరాజ్య సమితి గతేడాది తన నివేదికలో పేర్కొంది. మనదేశంలో రోడ్డు ప్రమాదాల్లో ఏటా రెండు లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. గాయపడ్డ వారి సంఖ్య దీనికి రెట్టింపు ఉంటుంది. 'ఇది యుద్ధాల్లో, ఉగ్రవాద దాడుల్లో చనిపోతున్న వారి సంఖ్య కన్నా చాలా ఎక్కువ." అని ఇటీవల కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువ, మధ్యస్థ ఆదాయాలు ఉన్న దేశాల్లోనే ఎక్కువ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని ఒక అధ్యయనం చెబుతోంది. రహదారులు సరిగ్గా లేకపోవడం, భద్రతా ప్రమాణాల్లోని లోపాలూ అధిక ప్రమాదాలకు కారణం. చాలీచాలని ఆదాయం పొందే వ్యవసాయ కార్మికులు, ఇతర కార్మికులు పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు అభద్ర ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితే ఎక్కువ సందర్భాల్లో ప్రమాదాలకు దారి తీస్తోంది. విస్తారమైన గ్రామీణ ప్రాంతం ఉన్న మన దేశంలో, రాష్ట్రంలో ఉన్నచోటనే పనిని కల్పిస్తే చాలావరకు ప్రమాదాలను నివారించవొచ్చు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడం, గరిష్టంగా పనిదినాలు, వేతనాలు కల్పించటం గ్రామీణ వలసల నివారణకు మేలైన పరిష్కారం. కానీ, బిజెపి ప్రభుత్వం... గ్రామీణ ప్రజలకు ఉపాధిని ఒక హక్కుగా కల్పించిన చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ వస్తోంది. గ్రామీణ ఉపాధి నిధులను ఏటేటా దిగ్గోస్తోంది.

రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలి. నాణ్యమైన రహదారుల నిర్మాణం, భద్రతా ప్రమాణాల పాటింపు ఖచ్చితంగా చేపట్టాలి. పరిమితికి మించిన ప్రయాణాలు చేయకుండా ఉండటానికి, వస్తు రవాణా వాహనాల్లో మనుషులు ఎక్కకుండా చేయటానికి నిబంధనలను కఠినతరం చేయడంతోనే సమస్య పరిష్కారం అయిపోదు. అలాంటి ప్రయాణాలు చేయని పరిస్థితిని కల్పించాలి. గ్రామీణ ఉపాధి కల్పనలో వ్యవసాయరంగం కీలకపాత్ర వహిస్తున్నదన్న ఎరుకతో దాని అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలి. గ్రామీణ శ్రామికులకు గౌరవ జీవితం కల్పిస్తామని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందుకు బాటలు పరిచే ఉపాధి హామీ చట్టం పటిష్టంగా అమలయ్యే పూనిక వహించాలి. రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు తక్షణం రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించి, ఆసరాగా నిలవాలి. పొట్టకూటికి వలస పోయే దుర్భర స్థితి నుంచి గ్రామాలను రక్షించటానికి – ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయటం ఒక్కటే తక్షణ పరిష్కారమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి. దానిని నిర్వీర్యం చేయటమే విధిగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, అవసరమైన ప్రతిచోటా, అవసరమైన ప్రతి మనిషికీ పని కల్పించాలి.

మంచి మాట



నువ్వు ధైర్యంగా ఒక అడుగు ముందుకేస్తే విజయం పది అడుగులు ముందుకొస్తుంది.

- రవీంద్రనాథ్ టాగూర్, విశ్వకవి.



విశ్లేషణ

పట్టణ మంచినీటి వ్యాపారీకరణకే 'అమృత్' పథకం



డా॥ బి.గంగారావు


మంచినీరు, మురుగునీటి సదుపాయం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'అమృత్' పథకాన్ని, దాని విషమ షరతులను రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలు చేయడానికి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర బిజెపి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10,251 కోట్ల విలువగల 281 మంచినీరు, మురుగునీటి శుద్ధి పనులను కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (చామ్) పద్ధతిలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చింది. ఈ మొత్తం నిధుల్లో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2470 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2490 కోట్లు, పట్టణ స్థానిక సంస్థల వాటా రూ.590 కోట్లుగా తేల్చారు. మిగిలిన రూ.4701 కోట్ల నిధులు బాండ్లు, రుణాలు, స్టాక్ మార్కెట్, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ద్వారా సమీకరిస్తారు. రాష్ట్రంలో మొత్తం 33 పట్టణాలు, నగరాలు అమృత్ పథకాలలో ఉన్నాయి. ఇందులో మిలియన్ ప్లస్ నగరాలుగా విశాఖపట్నం, విజయవాడలు ఉన్నాయి. అమరావతిని కూడా ఈ పథకంలో చేర్చారు. ఈ పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం కేవలం రూ. 1056 కోట్లు మాత్రమే ఈ పథకం కింద ఆంధ్ర రాష్ట్రానికి నిధులు ఇచ్చింది. గత వైసిపి ప్రభుత్వం ఈ పథకం కింద నిధులు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించిందని కూటమి ప్రభుత్వం విమర్శిస్తున్నది. అందువల్ల అమృత్ నిధులు కోల్పోకుండా కేంద్రాన్ని ఒప్పించి రాష్ట్రానికి తీసుకొస్తామని కూటమి ప్రభుత్వం గొప్పగా చెపుతున్నది.

రాష్ట్ర ప్రభుత్వం అమృత్ కింద చేపడుతున్న 281 నీటి ప్రాజెక్టులకు ఎక్కువ భాగం కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (ప్రైవేట్ పెట్టుబడుల భాగస్వామ్యంతో ప్రాజెక్టులు చేపట్టటం) కింద సమీకరించడానికి పూనుకున్నది. ఈ మోడల్‌లో నిధులు సమీకరించడంతోపాటు పెద్ద ప్రాజెక్టుల మంచినీరు, మురుగునీటి పారుదల నిర్మాణం, నిర్వహణను కూడా ప్రైవేట్ వారికి అప్పజెప్పనున్నారు. ఇప్పటివరకు ఆంధ్ర రాష్ట్రంలో మంచినీటి నిర్వహణలో ఈ పద్ధతి అమలులోకి రాలేదు.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే అమృత్ (అటల్ పునరుద్ధరణ మరియు పట్టణాల రూపాంతరీకరణ మిషన్) పథకాన్ని దేశవ్యాప్తంగా 500 నగరాల్లో అమలు చేయడానికి జూన్ 2015న ప్రారంభించారు. 2015–20 మధ్య ఐదేళ్ల కాలంలో రూ.50 వేల కోట్ల నిధులతో ప్రతిపాదించారు. ఆ తరువాత అమృత్2 పేర అక్టోబర్ 2021 నుండి 2026 వరకు రెండో దశగా కొనసాగిస్తున్నారు. ఈ ఐదేళ్లలో రూ.2,77,000 కోట్ల నిధులు ఖర్చు చేయాలని ఇందులో రూ.76760 కోట్లు కేంద్ర ప్రభుత్వ వాటాగా...మిగిలింది రాష్ట్రాలు, స్థానిక సంస్థలు భరించాలి.

మంచినీరు, మురుగునీటి పారుదల వ్యవస్థ, వరద నీటి ప్రవాహ కాలువలు, రవాణా, ఉద్యాన వనాలు వంటివి ఈ పథకంలో ఉన్నాయి. ఈ పథకంలోని నిధులన్నీ సంస్కరణలతో ముడిపెట్టి ఇచ్చేవే. తప్పనిసరిగా పట్టణ రంగంలో 11 రకాల సంస్కరణలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలి. ప్రభుత్వం పౌరసేవల బాధ్యత నుండి క్రమేణా వైదొలగి ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేయాలి. అలాగే చేపడుతున్న పనుల్లో కనీసం 10 శాతం ప్రాజెక్టులు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి)లో చేపట్టాలి. అలాగే కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలు వాటాలు మినహా మిగిలిన 50 శాతం బాండ్లు, రుణాలు, స్టాక్ మార్కెట్, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థల నుండి నిధులు సేకరించాలని నిబంధనలు విధించింది. ఒకవేళ మొత్తం నీటి ప్రాజెక్ట్‌ను ప్రైవేట్ వారికి ఇస్తే ప్రాజెక్ట్ వ్యయంలో 40 శాతం కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల వయబులిటీ గ్యాప్ నిధి కింద వడ్డీ లేని రుణాన్ని రాష్ట్రానికి ఇస్తుంది. ఒకవేళ చిన్న నగరాలు, పట్టణాల్లో స్థానిక సంస్థలే మౌలిక సదుపాయాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఖర్చులను వినియోగదారుల నుండి పూర్తిగా రాబట్టాలి. ఉదాహరణకు మంచినీటి సరఫరాలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఖర్చులు అంటే నీటి సరఫరా శాఖలోని ఉద్యోగుల జీతభత్యాలు, నీటి సరఫరాకి అయ్యే విద్యుత్, పంపుసెట్లు, మోటార్ రిపేర్లు, పైపులైన్ల నిర్వహణ, పాత వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటయ్యే ఖర్చుతో పాటు నీటి ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకొచ్చిన అప్పులపై వడ్డీలు మొదలగు వాటిని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద లెక్కించాల్సి ఉంటుంది. వీటికి సమానంగా నీటి చార్జీలు నిర్ణయించాలి. పేదలకు, మురికివాడల్లోని పౌరులకు ఉచితంగా మంచినీరు సరఫరా చేయకూడదు. అయితే ఇప్పటివరకు ఈ పథకంలో రూ.83,357 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ప్రజలమీద వివిధ రకాల భారాలు మోపాల్సి రావడంతో, కొన్ని ప్రాజెక్టులు ప్రైవేట్ సంస్థలకు కట్టబెటాల్సి రావడంతో కొన్ని రాష్ట్రాల్లో ఈ పథకం అమలు నత్తనడకన సాగుతున్నది. కొన్ని రాష్ట్రాలు సంస్కరణలు అమలు చేయకుండా సొంత నిధుల ద్వారానే కేంద్ర నిధులు పరిమిత స్థాయిలో పొందుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం అమృత్ పథకం షరతులను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు పూనుకుంది. ఈ పథకం ప్రారంభంలోనే అనగా 2015 లోనే చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడే అమృత్ పథకాన్ని అమలు చేసేందుకు కేంద్రంతో ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నీటి చార్జీలు పెంచుతూ 2018లో జీవో నెంబర్ 159ని విడుదల చేశారు. నెలవారీ నీటి చార్జీలే కాకుండా కొళాయి కనెక్షన్ డొనేషన్లు కూడా భారీగా పెంచింది. మురుగునీటి కనెక్షన్లపై చార్జీలు విధించారు. అలాగే రాష్ట్ర నూతన నీటి చార్జీల విధాన పత్రాన్ని విడుదల చేసింది. ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత రావడం, 2019లో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ జీవోను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం ఆ జీవో అమలుకు పూనుకోలేదు.



> **అమృత్ పథకం ముఖ్య లక్ష్యం పట్టణ రంగంలోని మున్సిపల్ సేవలన్నిటిని ప్రైవేటీకరించటమే. ముఖ్యంగా మంచినీటి రంగాన్ని పూర్తిగా ప్రైవేట్ పరం చేయటం. మంచినీటి సరఫరా బాధ్యత నుండి మున్సిపల్ నగర పాలక సంస్థలను తప్పించటం. ప్రత్యేక మంచినీటి బోర్డులను ఏర్పాటు చేయటం. ఈ బోర్డుల నిర్వహణ బాధ్యతను పూర్తిగా ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడం. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) పేర మంచినీటి సరఫరాను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేయటం. స్థూలంగా ఇవి ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలే. తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వీటిని వేగంగా అమలు చేసేందుకు పూనుకున్నది. త్వరలో రాష్ట్రంలో మంచినీటి చార్జీలు భారీగా పెరగనున్నాయి.**

ఇప్పుడు తిరిగి ఆ జీవో అమలు లేదా అలాంటి మరో కొత్త జీవో విడుదల చేయనున్నారు. ఎందుకంటే 'అమృత్' నిధులు పొందాలంటే నీటి చార్జీలు పెంచటం, కనీసం మంచి నీటి నిర్వహణకయ్యే ఖర్చును పూర్తిగా వినియోగదారుల నుండి రాబట్టడం తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వం చేయాలి. ఇప్పటి వరకు మంచి నీటి చార్జీలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపల్ సంస్థల్లో ఒకే విధంగా లేవు. మున్సిపల్, నగరపాలక సంస్థలు నీటి కనెక్షన్ డిపాజిట్ల రేట్లు నిర్ణయించుకుంటున్నాయి. నీటి చార్జీలు పెంచాలని భావిస్తే ముందుగా మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయించిన రేట్ల ముసాయిదాను అభిప్రాయాలు, అభ్యంతరాల కోసం ప్రజల ముందుంచుతారు. ప్రజల అభ్యంతరాల అనంతరం తిరిగి మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చించి చివరిగా చార్జీల పెంపుపై నిర్ణయం చేస్తారు. తరువాత జిల్లా గెజిట్లో ప్రచురిస్తారు. ఈ విధానం అమృత పథకంలో ఉన్న రాష్ట్రాలు కొనసాగటానికి వీలు ఉండదు. ఇప్పుడు దీనిని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తుంది.

గతంలోనే చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నీటి చార్జీలు పెంపు అధికారాన్ని రాష్ట్ర చీఫ్ ఇంజనీర్‌కి బదిలీ చేశారు. ఇందుకు అనుగుణంగా మున్సిపల్ చట్టంలో కూడా సవరణలు చేయటానికి ప్రయత్నించారు. ఇప్పుడు ఆ సవరణలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కాబోతున్నది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు తమ పరిధిలో మంచినీటి చార్జీలను నిర్ణయించుకునే రాజ్యాంగం కల్పించిన హక్కును కోల్పోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నీటి చార్జీల విషయంలో మున్సిపల్, నగరపాలక సంస్థలు నడుచుకునే విధంగా చట్టాలు సవరించనున్నారు. ఈ చర్య 74వ రాజ్యాంగ స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీస్తుంది. పట్టణ స్థానిక సంస్థల హక్కులను హరించి వేస్తున్నది.

రాష్ట్రంలో నేడు పట్టణాలు, నగరాల్లో మంచినీటి సరఫరా అత్యంత ఘోరంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 123 మున్సిపల్ పట్టణ, నగరపాలక సంస్థలు ఉన్నాయి. ప్రతిరోజు కనీసం గంట చొప్పున మంచినీటి సరఫరా చేస్తున్న పట్టణాలు బహు కొద్ది మాత్రమే. 30 పట్టణాల్లో బోరు నీరు మాత్రమే సరఫరా చేస్తున్నారు. సగం పట్టణాల్లో రోజు విడిచి రోజు, మరికొన్ని పట్టణాల్లో మూడు లేదా నాలుగు రోజులకు ఒకసారి మంచినీరు సరఫరా చేస్తున్నారు. ప్రమాణాల ప్రకారం ఒక మనిషికి రోజుకి 135 లీటర్లు నీరు సరఫరా చేయాలి. రాష్ట్రంలో నేడు సగటున 50 లీటర్లు మించి సరఫరా చేయటం లేదు. దీన్నిబట్టి పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాక మంచినీటి కనెక్షన్లు ఉన్నవారు కూడా చాలా తక్కువ. రాష్ట్రంలో అన్ని పట్టణాల్లో రూ.46.78 లక్షల ఆస్తి పన్ను కలిగిన ఇళ్లు ఉంటే వాటిలో 42 శాతం ఇళ్లకు మాత్రమే నీటి కనెక్షన్లు ఉన్నాయి. విశాఖ నగరంలో సుమారు రూ.5 లక్షల 60 వేల ఆస్తి పన్ను కలిగిన ఇళ్లు ఉంటే నీటి కనెక్షన్లు కేవలం 2.6 లక్షల ఇళ్లకు మాత్రమే ఉన్నాయి. సురక్షిత మంచినీరు లేక ప్రతి ఏడాది లక్షల మంది పట్టణ ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఇక భూగర్భ మురుగునీటి వ్యవస్థ కేవలం ఆరు నగరాల్లోనే అదే అరకొరగా ఉంది. ఈ దుస్థితి నుండి పట్టణ ప్రజలకు విముక్తి కలిగించే చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టకుండా ఇప్పుడు మంచి నీటి వ్యాపారీకరణకు సిద్ధమైంది.

భారతదేశంలో పట్టణ వ్యవస్థలో మంచినీటి సంస్కరణలు 2002 లోనే ప్రారంభమైంది. అప్పటి ప్రధాని వాజ్‌పేయి ప్రభుత్వం వీటికి బీజం వేసింది. ఆ తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ ఆధునీకరణ పథకాన్ని (జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం)ను 2005లో ప్రారంభించింది. దేశవ్యాప్తంగా పట్టణ రంగంలో వేగంగా సంస్కరణలు అమలు చేయాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించింది. 2012 వరకు ఈ పథకాన్ని అమలు జరిపింది. మంచినీటి రంగంలో తీవ్ర మార్పులు తీసుకురావాలని ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. వామపక్షాలతో పాటు అనేక ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ సంస్కరణల అమలుకు వ్యతిరేకించాయి. ప్రజల నుండి కూడా వ్యతిరేకత వ్యక్తం అయింది. ఫలితంగా నీటి సంస్కరణలును కాంగ్రెస్ పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణాల మౌలిక సదుపాయాల అభివృద్ధి పేర రెండు పథకాలను ప్రవేశపెట్టింది. మొదటిది స్మార్ట్ సిటీలు, రెండోది అమృత పథకం.

అమృత్ పథకం ముఖ్య లక్ష్యం పట్టణ రంగంలోని మున్సిపల్ సేవలన్నిటిని ప్రైవేటీకరించటమే. ముఖ్యంగా మంచినీటి రంగాన్ని పూర్తిగా ప్రైవేట్ పరం చేయటం. మంచినీటి సరఫరా బాధ్యత నుండి మున్సిపల్ నగరపాలక సంస్థలను తప్పించటం. ప్రత్యేక మంచినీటి బోర్డులను ఏర్పాటు చేయటం. ఈ బోర్డుల నిర్వహణ బాధ్యతను పూర్తిగా ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడం. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) పేర మంచినీటి సరఫరాను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేయటం. స్థూలంగా ఇవి ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలే. తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వీటిని వేగంగా అమలు చేసేందుకు పూనుకున్నది. రాష్ట్రంలో మొత్తం పట్టణ నీటి వ్యవస్థను వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ చేయటమే వీటి 'కర్తవ్యం'గా మారింది. త్వరలో రాష్ట్రంలో మంచినీటి చార్జీలు భారీగా పెరగనున్నాయి.

/వ్యాసకర్త సెల్ : 9490098792/

సమస్య

విద్యారంగ సంస్కరణలు పాఠశాలల కుదింపునకే





కె. విజయగౌరి

ప్రభుత్వాలు మారితేనేం అప్పటివరకు వున్న సంస్కరణలను వేగవంతం చేయడమే నేటి పాలకుల లక్ష్యం. గతంలో ఉపాధ్యాయుల కుదింపునకు, ఈనాడు ఏకంగా పాఠశాలల క్లస్టరైజేషన్ (కేంద్రీకృతం)కు సిద్ధమౌతున్నారు. రకరకాల పాఠశాలల పేరుతో పాఠశాలలు, టీచర్ల కుదింపు ప్రస్తుతం జరుగనున్నది. ఈ కుదింపు గ్రామాలలో ప్రాథమిక విద్యా వ్యవస్థ లేకుండా చేయనున్నది. ఈ సంస్కరణలకు సంబంధించి ప్రజలను గాని, విద్యార్థులను గాని, టీచర్లను గాని అడగలేదు. మరి ఎందుకు చేస్తున్నట్లు?

ఎందుకంటే...

పాఠశాలల విలీనం వలన టీచర్ల సంఖ్యను తగ్గించవచ్చు. పాఠశాలల సంఖ్యను తగ్గించవచ్చు. బడ్జెట్లో కేటాయింపులు తగ్గించవచ్చు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేరడానికి, చదవడానికి సుముఖత లేకుండా చేసే విధానాలను ఎంపిక చేసి నూతన జాతీయ విద్యావిధానం (ఎన్.ఇ.పి) అమలును సంపూర్ణం చేయనుంది. దీనితో ప్రభుత్వ పాఠశాలల సైజును తగ్గించనుంది. కనుకనే అనేక రకాల పాఠశాలలను తీసుకొచ్చింది. ప్రభుత్వ విద్యారంగాన్ని అతలాకుతలం చేసిన 117 జీవో ను రద్దు చేయమని అడిగితే, రద్దు చేస్తున్నట్లు ప్రకటిస్తూ దానికంటే అసంబద్ధ విధానాలు కలిగిన అంశాలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయనుంది. రాష్ట్ర విద్యారంగంలో సంక్షోభం తీవ్రం అవుతుందని ఈ ఏడాది విద్యాసంవత్సరం నుండి అమలు చేస్తున్న నిర్ణయాలు తెలియచేస్తున్నాయి.

ఫౌండేషన్ స్కూళ్ల పేరుతో అనేక గ్రామాలలో 3,4,5 తరగతులను లేకుండా చేయడం. దీనివలన ప్రాథమిక పాఠశాల వ్యవస్థ రద్దు కాబడుతుంది. తొమ్మిది రకాల పాఠశాలల పేరుతో వ్యవస్థలో మార్పు చేస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే గందరగోళంగా ఉంది. శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు (పి.పి1, పి.పి2), ఫౌండేషన్ స్కూళ్లు (పి.పి1, పి.పి2, ఒకటి, రెండు తరగతులు), బేసిక్ ప్రైమరీ స్కూళ్లు (పి.పి1, పి.పి2, 1 నుంచి 5 తరగతులు), మోడల్ ప్రైమరీ స్కూళ్లు (పి.పి1, పి.పి2, 1 నుంచి 8 తరగతులు), ప్రాథమికోన్నత పాఠశాలలు (6 నుంచి 10 తరగతులు), ఉన్నత పాఠశాలలు (1–10 తరగతులు), హైస్కూల్ ప్లస్ (6–12 తరగతులు), హైస్కూల్ ప్లస్ (1–12 తరగతులు). ఈ దొంతరల పాఠశాలలను 2025–26 విద్యా సంవత్సరంలో అమలు చేయనున్నారు.

> **టీచర్ల రేషనలైజేషన్ గతంలో చేశారు. ఇప్పుడు నూతన అంశం పాఠశాలల రేషనలైజేషన్. ఈ కోణం నుండే 9 రకాల స్కూళ్ల ఏర్పాటు. ఇన్ని పాఠశాలల మనుగడ ఎలాగూ ఉండదని తెలిసే ప్రభుత్వం కావాలని చేస్తున్నది. ఫలితంగా ఊరికి ఒక పాఠశాల మిగులుతుంది. కొన్నాళ్లకు మండలానికి కేంద్రీకరించబడతాయి. ఇదే ఎన్.ఇ.పి చెప్పింది. దీని అమలు కోసమే ఈ సంస్కరణలు. పిల్లలు పెరిగితే టీచర్లు పెరుగుతారు. పిల్లలు తగ్గితే టీచర్లు తగ్గుతారనేది రేషనలైజేషన్ ప్రాథమిక సూత్రం. ఈ వాదన వినడానికి బాగానే ఉంటుంది. కానీ పిల్లలు తగ్గారని మరల టీచర్ల సంఖ్య తగ్గుతుంది. దీనివలన పిల్లల సంఖ్య తగ్గుతుందే గాని పెరగదు. ఫలితంగా రెండు లేదా మూడు రేషనలైజేషన్లకు పాఠశాలలు మూతపడతాయి.**

ఈ దొంతర పాఠశాలలు ఎక్కడ నుండి వచ్చాయి అంటే నూతన జాతీయ విద్యా విధానం ప్రతిపాదనలలో భాగమే. ఈ రకమైన పాఠశాలల నిర్వహణ నష్టమా, లాభమా అని పరిశీలిస్తే, మన రాష్ట్ర విద్యా రంగానికి కచ్చితంగా నష్టమే అని చెప్పవచ్చు. గత అనుభవాలు అలా ఉన్నాయి మరి. 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేసినపుడు లక్షలాదిమంది పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. ప్రభుత్వ పాఠశాలల నుండి పిల్లలు తరలిపోతుంటే మన విధానాలు సరైనవా, కాదా అనే సమీక్ష కూడా చేసే స్థితిలో లేదు ప్రభుత్వం. ఎందుకు లేరంటే గత ప్రభుత్వ బాటలోనే నేటి పాలకులు ఎన్.ఇ.పి ని అమలు చేసేందుకు, వేగం పెంచడానికి పూనుకున్నారు గనుక. పైగా ఎ.పి విద్యా హక్కు చట్టంలో వున్న అంశాలు కూడా కనుమరుగు అవబోతున్నాయి. ప్రభుత్వ విద్యను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేందుకు పాలకులు సుముఖంగా లేరు. ప్రభుత్వ విద్యపై పెట్టే ఖర్చుకు లెక్కలు వేసి మనకేం లాభమని చర్చిస్తున్నారు. కనుక డౌన్ సైజ్ ఎలా చేయాలా అని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అలా వచ్చినవే ఈ 9 రకాల పాఠశాలలు. అంగన్వాడి పిల్లలతో కలిపి 1,2 తరగతులకు చదువంట. 1 నుండి 10వ తరగతి వరకు ఒక రకమంట. మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరుతో బేసిక్ ప్రైమరీ పాఠశాలల నుండి 3,4,5 తరగతులను తరలించడం. వీటి కారణంగా విద్యారంగంపై నమ్మకం తగ్గిపోతుంది. ఎప్పటి వలె 1 నుండి 5 తరగతుల ప్రాథమిక పాఠశాలలు, 1 నుండి 8 వరకు ప్రాథమికోన్నత పాఠశాలలు, 6 నుండి 10 వరకు ఉన్నత పాఠశాలలుగా నిర్వహించే ఈ వ్యవస్థను ఎందుకు మారుస్తున్నారు? ఇదే ఎన్.ఇ.పి అమలు. ఇది ఒక సామాజిక విభజనకు దారితీస్తుంది. ఈ మధ్యన క్లస్టర్ స్కూల్ కాంప్లెక్సులను ఏర్పాటు చేశారు. కొన్ని అధికారాలు ఇచ్చారు. కొత్త విధానం ప్రకారం స్కూలు కాంప్లెక్సు విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి లెక్కిస్తారు. అందుకే సంస్కరణల్లో మిగులు టీచర్లను క్లస్టరు స్కూలు కాంప్లెక్సులకు పంపుతారు. ఉపాధ్యాయుడు పాఠశాలకు చెందిన వాడిగాకాక స్కూలు కాంప్లెక్సుకు చెందిన వాడిగా మారి, ఆ కాంప్లెక్సు పరిధిలో అన్ని పాఠశాలలకు బోధించడానికి వెళ్లవలసి వస్తుంది. పైగా ఈ తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థ టీచర్ల మిగులు భారీగా చూపుతుంది. ఇప్పుడు ప్రస్తుతం ఇదే జరగబోతోంది.

ఎన్.ఇ.పి లో భాగమే రేషనలైజేషన్

టీచర్ల రేషనలైజేషన్ గతంలో చేశారు. ఇప్పుడు నూతన అంశం పాఠశాలల రేషనలైజేషన్. ఈ కోణం నుండే 9 రకాల స్కూళ్ల ఏర్పాటు. ఇన్ని పాఠశాలల మనుగడ ఎలాగూ ఉండదని తెలిసే ప్రభుత్వం కావాలని చేస్తున్నది. ఫలితంగా ఊరికి ఒక పాఠశాల మిగులుతుంది. కొన్నాళ్లకు మండలానికి కేంద్రీకరించబడతాయి. ఇదే ఎన్.ఇ.పి చెప్పింది. దీని అమలు కోసమే ఈ సంస్కరణలు. పిల్లలు పెరిగితే టీచర్లు పెరుగుతారు. పిల్లలు తగ్గితే టీచర్లు తగ్గుతారనేది రేషనలైజేషన్ ప్రాథమిక సూత్రం. ఈ వాదన వినడానికి బాగానే ఉంటుంది. కానీ పిల్లలు తగ్గారని మరల టీచర్ల సంఖ్య తగ్గుతుంది. దీనివలన పిల్లల సంఖ్య తగ్గుతుందే గాని పెరగదు. ఫలితంగా రెండు లేదా మూడు రేషనలైజేషన్లకు పాఠశాలలు మూతపడతాయి. ఇప్పుడు జరుగుతున్నది ఇదే. 60 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు ఉంటే, ఏ కారణంతోనైనా ఇద్దరు పిల్లలు తగ్గితే మరలా ఇద్దరు టీచర్లు ఉంటారు. ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్నారు గనుక మా పిల్లలకు ఇక్కడైతే చదువు రాదని వారిని వేరే స్కూలుకి (ప్రైవేటు) పంపుతారు. మరల పిల్లలు తగ్గుతారు. టీచర్లనూ తగ్గిస్తారు. ఇదంతా ప్రైవేటు వారికోసమే.

ప్రభుత్వ ప్రోత్సహంతోనే ఈ చర్యలు

పాఠశాలల మూసివేత, టీచర్ పోస్టులు రద్దు లక్ష్యంగా హేతుబద్ధీకరణ ప్రక్రియ సాగుతున్నది. ప్రస్తుతం అమలు చేస్తున్న ఈ రేషనలైజేషన్ ప్రక్రియలో ఉన్న మరో ప్రమాదం ఏమంటే బడిలో పిల్లల సంఖ్య పెరగడం, తగ్గడం అనేది కేవలం ఉపాధ్యాయునిపై ఉన్న విశ్వాసమని, టీచర్లకు సంబంధించిన విషయమని ప్రచారం చేస్తున్నది. వాస్తవానికి ఈ అంశం ప్రభుత్వం, విద్యశాఖల విశ్వసనీయతకు సంబంధించినది. ప్రభుత్వ ప్రోత్సాహంతో విద్యా వ్యాపారం బాగా జరుగుతున్న రాష్ట్రం మనది. ప్రభుత్వం పాఠశాలలను సంక్షోభం నుండి బయటకు తీసుకు రావాలనే ప్రయత్నం ఎందుకు చేయరంటే విద్యా వ్యాపారం మార్కెట్లో తగ్గిపోతుంది. ఇంకా సమాధానం చెప్పాల్సి వస్తే కామన్ స్కూల్ సిస్టమ్ పెట్టాలి. ఇటువంటి విధానాలు పాలకులు అమలు చేయగలరా?

అలాగే రేషనలైజేషన్ ప్రభుత్వ బడులకు మాత్రమే ఉండి, ప్రైవేటు బడులకు లేకపోవడం, ప్రభుత్వ బడులలో టీచర్ పోస్టులు రద్దు కావడం, ఎటువంటి నియంత్రణ లేకుండా ప్రైవేటు బడులను వదిలి వేయడం వలన ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలోకి నెట్టబడుతుంది. ప్రభుత్వ బడులను కాపాడుకోవాలనే శక్తులు ప్రభుత్వ బడులలో సౌకర్యాలతో పాటు, టీచర్ పోస్టులను కాపాడుకోవడానికి, మరోవైపు ప్రైవేటుబడులపై నియంత్రణ లక్ష్యంగా ఉద్యమించకపోతే ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్క బడిని మాత్రమే ఉంచుతుంది. అదే ప్రైవేటు బడి. రేషనలైజేషన్ అంతిమ లక్ష్యం కూడా అదే. ఏ వర్గాల పిల్లలు ప్రభుత్వ బడులలో చదువుతున్నారో ఆ ప్రజానీకంతో సంస్కరణలపై ప్రతిఘటనకు విశాల ఉద్యమంతో కదలాలి.

/ వ్యాసకర్త యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, సెల్ : 8985383255 /

మణిపూర్‌లో ఎన్‌కౌంటర్

- 10 మంది ఉగ్రవాదులు మృతి

చందేల్ : మణిపూర్‌లోని చందేల్ జిల్లాలో అస్సాం రైఫిల్స్ యూనిట్ కి, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 10 మంది ఉగ్రవాదులు మరణించారని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆర్మీ తూర్పు కమాండ్ ఎక్స్ లో పోస్ట్ చేసింది. "ఇండో–మయన్మార్ సరిహద్దుకు దగ్గరగా ఉన్న చందేల్ జిల్లా ఖెంగ్‌జోయ్ తహసీల్‌లోని న్యూ సమతాల్ గ్రామం సమీపంలో సాయుధ క్యాడర్ల కదలికలపై నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా, స్పియర్ కార్ప్స్ ఆధ్వర్యంలోని అస్సాం రైఫిల్స్ యూనిట్ మే 14న ఆపరేషన్ ప్రారంభించింది" అని తెలిపింది.

టిఆర్‌ఎఫ్‌ను ఉగ్ర సంస్థగా ప్రకటించాలి..

- ఐరాసలో భారత్ పట్టు

జెనీవా. పహల్గాంలో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన లష్కరే తోయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టిఆర్‌ఎఫ్)ను అంతర్జాతీయ ఉగ్రసంస్థల జాబితాలో చేర్చేందుకు భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఐక్యరాజ్య సమితి (ఐరాస)లో భారత్ తన స్వరాన్ని గట్టిగా వినిపిస్తోంది. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ఉన్నతాధికారులను భారత్ ప్రతినిధుల బృందం తాజాగా కలిసింది. ఐరాస భద్రతా మండలికి చెందిన 1267 శాంక్షన్స్ కమిటీకి పహల్గాం ఉగ్రదాడి గురించి వివరించింది. ఉగ్ర దాడికి పాల్పడినట్టు రుజువు చేసే సాక్ష్యాధారాలను సమర్పించింది. యుఎన్ ఆఫీస్ ఆఫ్ కౌంటర్ టెర్రరిజం, కౌంటర్ టెర్రరిజం కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరేట్‌తో భేటీ అయింది. పహల్గాం ఉగ్రదాడి తమపనే అని టిఆర్‌ఎఫ్ మొదట్లో ప్రకటించింది, ఆ తర్వాత తోసిపుచ్చింది.

ఖాన్ యూనిస్‌పై ఇజ్రాయిల్ మారణహోమం

- వైమానికదాడిలో 94 మంది మృతి
- మృతుల్లో జర్నలిస్టు కుటుంబం



రమాలా : గాజాపై ఇజ్రాయిల్ మారణహోమం కొనసాగిస్తోంది. తాజాగా దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌పై అర్ధరాత్రి వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో 94 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అక్కడి ఆస్పత్రి వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాన్‌యూనిస్ నగరంపై టెల్‌అవీవ్ దాదాపు 10 విమానాలతో దాడులు చేసింది. ఈ భీకర దాడుల్లో 94 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 25 మంది పైగా చిన్నారులున్నారు. ఖతారీ టెలివిజన్ నెట్‌వర్క్‌కు చెందిన ఒక జర్నలిస్టు, అతడి కుటుంబంలోని 11 మంది కూడా మరణించారు. బుధవారం ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 70 మంది వరకు మరణించారు. ఇటీవల అగ్రరాజ్యం మధ్యవర్తిత్వంతో ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో హమాస్ ఇజ్రాయిల్ లో ఉన్న అమెరికాకు చెందిన ఓ బందీని విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్యప్రాచ్యంలో పర్యటనలో ఉండగా.. ఇజ్రాయిల్ ఈ దాడులు చేయడం గమనార్హం.

అటవీ భూముల స్థితిగతుల పరిశీలనకు సిట్‌లు ఏర్పాటు చేయండి

- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : రిజర్వ్ అటవీ భూములను అటవీయేతర ప్రయోజనాల కోసం కేటాయించినట్లైతే వాటి స్థితిగతులను పరిశీలించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు గురువారం రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. అటువంటి భూములను ఎవరైనా తీసుకుంటే వాటిని వెనక్కు ఇచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని, తిరిగి వాటిని అటవీ శాఖకు అప్పగించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్, జస్టిస్ అగస్టిన్‌జార్జి, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన బెంచ్ రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఆ భూమిని వెనక్కి తీసుకోవడం విస్తృత ప్రజా ప్రయోజనాల రీత్యా సరిపోదని భావించినట్లైతే ఆ భూమికైన వ్యయాన్ని ఎవరికైతే కేటాయించారో ఆయా వ్యక్తులు లేదా సంస్థల నుండి వసూలు చేయాలని బెంచ్ కోరింది. ఈ రోజు నుండి ఏడాదిలోగా అటువంటి బదిలీలన్నీ జరిగేలా చూసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులను, కేంద్ర పాలిత ప్రాంతాల అడ్మినిస్ట్రేటర్లను ఆదేశించింది. పూనేలో రిజర్వ్ అటవీ భూమికి సంబంధించిన కేసులో తీర్పు సందర్భంగా సుప్రీం ఈ ఆదేశాలు జారీ చేసింది. విలువైన అటవీ భూములను వాణిజ్య ప్రయోజనాలకు మార్చే ప్రక్రియలో రాజకీయ నేతలు, అధికారులు, బిల్డర్ల మధ్య గల సంబంధాలకు ప్రస్తుత అంశం చక్కని ఉదాహరణ అని బెంచ్ వ్యాఖ్యానించింది.

గ్రామ సర్పంచ్‌లతో ఉపాధి నిధుల చెల్లింపులు

- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ఆదేశం

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధి నిధులను గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యాన చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ ఆర్థిక వికేంద్రీకరణ విభాగం డైరెక్టర్ రామ్‌ప్రతాప్ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఎపి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజకు ఆదేశాలు జారీ చేశారు. ఇదే అంశంపై మార్చి 13న కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సంయుక్త కార్యదర్శి అలోక్ ప్రేమ్‌నగర్‌కు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర ఛైర్మన్ జాస్తి వీరాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ ప్రధాన కార్యదర్శి కొత్తపు మునిరెడ్డి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల కోసం మెటీరియల్ సప్లైదారులకు చెల్లించే నిధులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఒ) ద్వారా చెల్లించే విధానం 2021లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే ఈ విధానం సరికాదని కేంద్ర మంత్రిత్వశాఖ పేర్కొంది. గ్రామ పంచాయతీల్లో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలోనే చెల్లింపులు చేపట్టాలని, ఎంపిడిఒలు చెల్లించడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని జాస్తి వీరాంజనేయులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీల్లో చేసే ఏ అభివృద్ధి కార్యక్రమమైనా గ్రామసభ ఆమోదంతో చేపట్టాలని కోరారు. ఉపాధి నిధులతో చేసే పనులకు మెటీరియల్ సప్లైదారులకు చెల్లింపులు కూడా గ్రామ పంచాయతీ ద్వారానే చెల్లించాలని కోరారు. ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ విఆర్ కృష్ణ తేజకు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఆర్థిక వికేంద్రీకరణ విభాగం డైరెక్టర్ రామ్ ప్రతాప్ ఉత్తర్వులు జారీ చేశారు.

సింధు జలాల ఒప్పందాన్ని సమీక్షిద్దాం

- భారత్‌కు లేఖ రాసిన పాక్

న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడులతో సింధు నదీ జలాల ఒప్పందాన్ని (ఐడబ్ల్యుటి) భారత్ నిలిపివేసిన నేపథ్యంలో దానిపై చర్చలు ప్రారంభించేందుకు, ఒప్పందాన్ని సమీక్షించేందుకు సిద్ధంగా వున్నట్లు పాకిస్తాన్ తెలియజేసింది. ఈ మేరకు పాక్ జలవనరుల శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా నుండి భారత్ జల వనరుల శాఖ కార్యదర్శి దేవశ్రీ ముఖర్జీకి వారం రోజుల క్రితమే ఒక లేఖ అందిందని అధికార వర్గాలు తెలిపాయి. పాకిస్తాన్‌కు చెందిన సింధు జలాల కమిషనర్‌తో చర్చలు జరిపేందుకు ఒక ప్రతినిధిని నియమిం చాల్సిందిగా ఆ లేఖలో కోరారు. కచ్చితంగా ఏ రోజున ఈ లేఖ పంపారనే విషయం వెల్లడించడానికి ఆ వర్గాలు నిరాకరించాయి. జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఈ ఉత్తరం పంపినట్లు ఆ వర్గాలు తెలిపాయి. దీనిపై వ్యాఖ్యానించడానికి భారత విదేశాంగ శాఖ నిరాకరించింది. సింధుజలాల ఒప్పందంపై తిరిగి ఇరు దేశాల ప్రభుత్వాలు చర్చలు జరపాలన్నది భారత్ వైఖరిగా వుంది. అవి జరిగేవరకు శాశ్వత సింధు కమిషన్ (పిఐసి) సమావేశాలేవీ జరగబోవని భారత్ గత సెప్టెంబరులోనే చెప్పింది. 2023 జనవరి నుండి భారత్ నాలుగుసార్లు పాకిస్తాన్‌కు లేఖ రాసింది, ఒప్పందాన్ని సవరించడంపై చర్చలు ప్రారంభించాలని కోరింది. పాకిస్తాన్ నుండి సంతృప్తికరమైన సమాధానం రాలేదు. తాజా పరిస్థితుల్లో సమావేశం కావడానికి, అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించడానికి సుముఖంగా వున్నట్లు పాక్ పేర్కొంటోంది.

చేనేత అభివృద్ధిపై మంత్రి సవిత మాటలు విడ్డూరం

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

రాష్ట్రంలోనే చేనేత రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని విజయవాడలో బుధవారం జరిగిన రాష్ట్ర చేనేత ప్రతినిధుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల ప్రతినిధులతో జరిగిన ఈ సమావేశంలో చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ.. ఆప్కో ద్వారా ప్రతి మూడు నెలలకు సహకార సంఘాల వద్ద వస్త్రాలు కొనుగోలు చేసి చేనేతను అభివృద్ధి చేస్తామని తెలిపారన్నారు. సహకార సంఘాలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.156 కోట్లు విడుదల చేయకపోవడంతో.. నాబార్డ్ వద్ద తీసుకున్న అప్పులకు వడ్డీలు చెల్లించలేని దివాలా తీస్తున్న స్థితిలో సహకార సంఘాలు ఉన్నాయని పేర్కొన్నారు. 2024-25 బడ్జెట్లో చేనేత రంగానికి మొత్తం రూ.161 కోట్లు కేటాయించి దానిలో చేనేతకు సంబంధం లేని యూనిట్ మాలకు రూ.86 కోట్లు కేటాయించారన్నారు. బడ్జెట్లో త్రిఫ్టఫండ్ కింద కేటాయించిన రూ.5 కోట్లు చేనేతలకు ఇవ్వలేదని తెలిపారు. 2025-26 బడ్జెట్లో త్రిఫ్టఫండ్ కింద కేటాయించిన రూ.5 కోట్లు విడుదల చేయకుండానే ఖర్చు చేశామని మంత్రి సవిత చెప్పడం శోచనీయమన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు జీఓ విడుదల చేశామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ అది అమలుకాలేదన్నారు. సహకార సంఘాలకు ఇవ్వాల్సిన రూ.156 కోట్ల హామీ ఇవ్వకుండా సహకార సంఘాలకు ఎన్నికలు జరుపుతామని మంత్రి మాట్లాడటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఎన్నికలు జరపాలంటే చేనేతలకు ఇవ్వాల్సిన త్రిఫ్టఫండ్ రూ.5 కోట్లు, సహకార సంఘాలకు చెల్లించాల్సిన పావలా వడ్డీ, సహకార సంఘాలు బ్యాంకులకు చెల్లించాల్సిన క్యాష్ క్రెడిట్ పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సంస్కరణలతో ప్రభుత్వ విద్యా సంస్థలు కనుమరుగు

- ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖలో తీసుకొస్తున్న సంస్కరణల వల్ల ప్రభుత్వ విద్యా సంస్థలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ స్థానంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించేందుకు 117, 19, 20, 21 వంటి జిఓలను తీసుకొస్తుందని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం పాఠశాల విద్యలో తీసుకొచ్చిన సంస్కరణలను ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తీవ్రంగా వ్యతిరేకించారని పేర్కొన్నారు. నేడు అధికారంలోకి వచ్చాక అవే విధానాలను అమలు చేస్తున్నారని తెలిపారు. నూతన విద్యా విధానం భాగంలో ప్రపంచ బ్యాంకు ఒప్పందం రాష్ట్రంలో అమలు చేస్తూ 45 వేల ప్రభుత్వ పాఠశాలలను 16 వేలకు తగ్గించాలని ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. నూతన విద్యావిధానానికి అనుగుణంగా ఈ ఒప్పందం ఉందని తెలిపారు. గత ప్రభుత్వం ఏకపక్షంగా అమలు చేసిన ఇంగ్లీష్ మీడియాన్ని వ్యతిరేకించిన టిడిపి గత ప్రభుత్వంలానే అమలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగానికి తగిన సమయం కేటాయించాలని కోరారు. విద్యారంగంలో మార్పులు అమలు చేసే ముందు విద్యార్థి సంఘాలు, మేధావులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు.

వైద్యారోగ్యశాఖలో ఖాళీల భర్తీకి సమగ్ర ప్రణాళిక

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వర్ణాంధ్ర-2047లో ఆరోగ్య రంగానికి సంబంధించిన లక్ష్యాల సాధనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. సచివాలయంలో వైద్యారోగ్యశాఖపై గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివిధ విభాగాల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి త్వరలో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సత్వర నియామకాల కోసం ఈ ప్రక్రియను ఎపిపిఎస్‌సి పరిధి నుంచి రాష్ట్ర వైద్య సేవల నియామక బోర్డు (ఎపి ఎంఎస్ఆర్‌బి) పరిధిలోకి తేవడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గత 11 నెలలుగా వివిధ విభాగాల్లో జరిగిన నియామకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రజలందరికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పించేందుకు మిశ్రమ పద్ధతి త్వరలో అమల్లోకి తీసుకురావాలని మంత్రి పేర్కొన్నారు. ఆయుష్ వైద్య సేవల రంగానికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ విభాగంలో 50 శాతానికిపైగా ఖాళీగా ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్, వివిధ విభాగాల డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైకోర్టుకు కడప మాజీ మేయర్

- తొలగింపు అన్యాయమంటూ లంచ్‌మోషన్ పిటిషన్
- ప్రభుత్వానికి నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

కడప మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి నుంచి తొలగిస్తూ మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి జారీ చేసిన ఆదేశాలను మేయర్‌గా చేసిన కె సురేష్‌బాబు హైకోర్టులో అత్యవసర పిటిషన్ ద్వారా సవాల్ చేశారు. దీనిని గురువారం జస్టిస్ చల్లా గుణరంజన్ విచారణ చేపట్టిన సందర్భంగా, కార్పొరేషన్ పరిధిలో తన కుటుంబ సభ్యులకు చెందిన వర్ధిని కన్‌స్ట్రక్షన్స్‌కు పనులు కేటాయించాలని పిటిషనర్ కార్పొరేషన్ కమిషనర్‌పై ఒత్తిడి చేశారా అని ప్రశ్నించారు. వివరాలు అందజేసేందుకు గడువు కావాలని ప్రభుత్వం కోరడంతో విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు. మేయర్ పదవి నుండి తొలగిస్తూ ఈ నెల 14న మున్సిపల్‌శాఖ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ పిటిషనర్ లంచ్‌మోషన్ పిటిషన్ తరపున అడ్వకేట్ కొవ్వూరి విఆర్ రెడ్డి వాదించారు. పిటిషనర్ స్వయంగా మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఎదుట హాజరయ్యారని చెప్పారు. న్యాయవాదితో కలిసి హాజరయ్యేందుకు 2 వారాల గడువు కోరిన తర్వాత ఆఘమేఘాలపై తొలగింపు ఉత్తర్వులు ఇచ్చారని తప్పుబట్టారు. తొలగింపు ఉత్తర్వులపై స్టే ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రణతి ప్రతివాదన చేస్తూ, మేయర్ పదవిని దుర్వినియోగం చేసిన కారణంగానే పదవి నుంచి తొలగింపు ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. కార్పొరేషన్ పరిధిలోని కాంట్రాక్టు పనులను పిటిషనర్ తన భార్య, కొడుకు కంపెనీలకు కట్టబెట్టారని చెప్పారు. నోటీసులిచ్చి వివరణ కోరాకే తొలగింపు ఉత్తర్వులు వెలువడ్డాయని, స్టే ఇవ్వొద్దని కోరారు. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

మద్యం కుంభకోణంలో ఎవరూ తప్పించుకోలేరు : మంత్రి కొల్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మద్యం కుంభకోణంలో పాత్రధారులు, సూత్రధారులు ఎవరూ తప్పించుకోలేరని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో వందకోట్లకే అక్కడ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి అరెస్టు అయ్యారని తెలిపారు. రాష్ట్రంలో రూ.వేల కోట్ల కుంభకోణం జరిగిందని విమర్శించారు. అందుకే అబద్ధపు రాతలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాన్ డ్యూటీ లిక్కర్‌ను ప్రభుత్వ షాపుల్లో అమ్మి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని తెలిపారు. పేరున్న బ్రాండ్‌లను తరిమికొట్టి సొంత బ్రాండ్‌లకు ఆర్డర్లు ఇచ్చుకొని కమీషన్లు దోచుకున్నారని ఆరోపించారు. నాసిరకం మద్యం అమ్మి ప్రజల ప్రాణాలు తీశారని విమర్శించారు. దోచుకోవటానికి డిజిటల్ లావాదేవీలు లేకుండా చేసి రూ.వేల కోట్లు కొల్లగొట్టారని పేర్కొన్నారు. ఈ విషయాలన్నీ సిట్ విచారణలో బయటకు వస్తుంటే వైఎస్ జగన్ ఓర్వలేకపోతున్నారని తెలిపారు. మద్యం కుంభకోణంలో విజయసాయిరెడ్డి, మిథున్ రెడ్డి, రాజ్ కసిరెడ్డి, గోవిందప్ప, ధనంజయరెడ్డి, విష్ణుమోహన్ రెడ్డి పాత్రలపై స్పష్టమైన ఆధారాలతో వార్తలు వస్తున్నాయని చెప్పారు. 10 మద్యం డిపోలను తాకట్టుపెట్టి రూ.13 వేల కోట్లు తీసుకొచ్చి దారి మళ్లించి కమీషన్లు కొల్లగొట్టింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. డిజిటల్ లావాదేవీలు లేకుండా రూ.99,413.5 కోట్లు డైరెక్ట్‌గా నగదు చెల్లింపును ప్రోత్సహించారని చెప్పారు.

పిడిఎస్ బలోపేతానికి కలిసి పనిచేద్దాం : మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) బలోపేతానికి అందరం కలిసి పనిచేద్దామని రేషన్ డీలర్లు, ఎమ్‌డియు ఆపరేటర్స్‌ను పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకు తగిన సహకారాన్ని అందించాలని కోరారు. విజయవాడలోని సివిల్ సప్లైయ్స్ భవన్‌లో రేషన్ డీలర్ల సంఘం నాయకులు, ఎమ్‌డియు ఆపరేటర్స్ యూనియన్ నాయకులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో చాలా పల్లెల్లో, పట్టణాల్లో ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం కోసం అనేక మంది ఇప్పటికీ ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం 2.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని, కేజీ బియ్యం రూ.46.10 కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 29 వేల చౌక ధరల దుకాణాల నుంచి సరఫరా చేస్తుందన్నారు. 6,500 మెట్రిక్ టన్నుల పంచదారను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సహకారంతో ముందడుగు వేస్తుందని మంత్రి తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ సౌరబ్ గౌర్, ఎమ్‌డి జిలాని తదితరులు పాల్గొన్నారు.

18న 'సంఘం శరణం గచ్ఛామి' నాటక ప్రదర్శన : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంత్యుత్సవాల్లో భాగంగా అంబేద్కర్ జీవిత విశేషాలతో రూపొందించి 'సంఘం శరణం గచ్ఛామి' నాటకాన్ని ఈ నెల 18న విజయవాడలో ప్రదర్శించనున్నట్లు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి తెలిపారు. విజయవాడలోని పూలే, అంబేద్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సంఘం శరణం గచ్ఛామి' నాటకాన్ని కెవిపిఎస్ ఆధ్వర్యాన కొంతకాలంగా రాష్ట్ర వ్యాప్తంగా 750 ప్రదర్శనలు ఇచ్చారన్నారు. ముగింపు ప్రదర్శన విజయవాడలోని ఎంబివికెలో ఉంటుందని తెలిపారు. విజయవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి నగరాజ్, నాయకులు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేనే మధ్యవర్తిత్వం చేశా..

- ట్రంప్ నోట మళ్లీ అదే మాట

ఖతార్ : భారత్ - పాకిస్తాన్‌ల మధ్య మధ్యవర్తిత్వం చేసి కాల్పుల విరమణకు ఒప్పించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చెప్పారు. గురువారం ఖతార్‌లోని సైనిక స్థావరంలో అమెరికా దళాలతో ట్రంప్ మాట్లాడుతూ అమెరికా దౌత్యపరంగా జోక్యం చేసుకునే ముందు భారత్ - పాకిస్తాన్ మధ్య పరిస్థితి ప్రమాదకరమైన స్థాయికి చేరుకుందని అన్నారు. 'నేను అలా చేశానని చెప్పుకోదలచుకోలేదు. కానీ, గతవారం భారత్ - పాకిస్తాన్ మధ్య సమస్యను పరిష్కరించడానికి నేను ఖచ్చితంగా సహాయం చేశాను' అని ట్రంప్ తెలిపారు. యుద్ధానికి బదులుగా వాణిజ్యం చేద్దామని ఇరు దేశాలకు చెప్పానని, ఇరు దేశాలతో వాణిజ్యం గురించి మాట్లాడానని తెలిపారు. తన మాటలకు భారత్, పాకిస్తాన్ సంతోషంగా ఉన్నాయని, ప్రస్తుతం ఇరుదేశాల మధ్య పరిస్థితి స్థిరంగా ఉందని ట్రంప్ చెప్పారు.

ఆపిల్ ఐ ఫోన్ల తయారీపై ట్రంప్ అక్కసు సామర్థ్యాన్ని పెంచవద్దని సిఇఒకు ఆదేశం

భారత్‌లో ఆపిల్ కంపెనీ కార్యకలాపాల విస్తరణపై కూడా ట్రంప్ అక్కసు వెళ్లగక్కారు. ఇండియాలో ఐఫోన్ల తయారీ సామర్థ్యాన్ని పెంచకూడదని ఆ కంపెనీ సిఇఒ టిమ్ కుక్‌ను ఆదేశించారు. తాను చెబితేనే భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగిందని ట్రంప్ పునరుద్ఘాటించారు. కాల్పులు నిలిపివేయకుంటే రెండు దేశాలతో వాణిజ్యాన్ని నిలిపివేస్తామని హెచ్చరించామన్నారు. దీంతో ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని చెప్పారు.

ఇరాన్‌పై ఒత్తిడి కొనసాగిస్తున్న ట్రంప్

దోహా : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై ఒత్తిడిని కొనసాగిస్తున్నారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న దౌత్య ప్రతిష్టంభనకు రెండు పరిష్కారాలు మాత్రమే వున్నాయని, అవి-అణు కార్యక్రమంపై ఒప్పందం కుదుర్చుకోవడం లేదా వైమానిక వాడులు ఎదుర్కొనడం ఈ రెండేనని చెప్పారు. కతార్‌లో వాణిజ్య నేతలతో మాట్లాడుతూ ట్రంప్, ఇరాన్ సమస్యను క్రూరమైన పద్ధతిలో కాకుండా తెలివైన పద్ధతిలో పరిష్కరించాలని భావిస్తున్నామని చెప్పారు. తెలివిగా వ్యవహరించడమా లేక క్రూరంగా వ్యవహరించడమా ఈ రెండే మన ముందున్న ప్రత్యామ్నాయాలని చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమంపై దౌత్య ఒప్పందం కుదుర్చుకోవాలని కతార్ అమీర్ షేక్ తమిన్ బిన్ హమద్ కూడా బాగా యఔషి చేస్తున్నారని, ఈ విషయంలో ఆయన నిజంగా పోరాడుతున్నారని, అందుకు ఇరాన్ కృతజ్ఞతలు చెప్పాలని ట్రంప్ వ్యాఖ్యానించారు.

స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయవాడ

తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలో ఉన్న స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో వివిధ కోర్సులకు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ పిఎస్ఎస్ లక్ష్మీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేథా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమం ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్) సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్ సర్వీసు, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ సెల్‌ఫోన్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేరు, సిసిటివి టెక్నీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, క్విల్ట్ బ్యాగ్స్ మేకింగ్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నారని తెలిపరు. ఇందుకు అర్హత గల అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు నేరుగా హాజరుకావాలని తెలిపారు. ఆరు నెలల కోర్సు కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఐటిఐ, పదో తరగతి, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై, 18-25 సంవత్సరాల వయస్సు ఉన్న అభ్యర్థులు అయి ఉండాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ట్రంప్‌నకు దాసోహం

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లింగ్ చేస్తున్నాయి. తాజాగా ట్రంప్ వ్యాఖ్యలతో ఆపిల్ కంపెనీ భారత్‌లో పెట్టుబడులను నిలిపివేయనుంద`ని స్పష్టమవుతోంది. ఇది ఎలక్ట్రానిక్స్‌లో రంగంలో మరిన్ని విదేశీ పెట్టుబడులకు విఘాతం కల్పించనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజా పరిణామాలతో ట్రంప్ విధానాలకు మోడీ దాసోహమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారత్‌పై అమెరికా ఆంక్షలు, షరతులపై ప్రధాని నరేంద్ర మోడీ ఒక్క మాట కూడా వ్యతిరేకంగా మాట్లాడకపోవడం ఆందోళనకర అంశం.

నేడు వాషింగ్టన్‌కు భారత బృందం

అమెరికాతో వాణిజ్య చర్చలు జరపడానికి భారత్ సన్నద్ధమవుతోన్న వేళ ట్రంప్ వ్యాఖ్యలు బెదిరింపు ధోరణిని ప్రదర్శిస్తున్నాయని స్పష్టమవుతోంది. వాణిజ్య చర్చల కోసం భారత ఉన్నతాధికారుల బృందం ఈ నెల 16న వాషింగ్టన్‌కు చేరుకోనుంది. ఈ నెల 17 నుంచి 20 వరకు జరగనున్న ఈ చర్చలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నాయకత్వం వహించనున్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆ దేశ వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్‌తో, వాణిజ్య శాఖ కార్యదర్శి హోవార్డ్ లూట్నిక్‌తో చర్చలు జరపనున్నారు. డొనాల్డ్ ట్రంప్ చెప్పిన విధంగా భారత్ జీరో టారిఫ్‌లకు అంగీకరిస్తే.. అమెరికా ఉత్పత్తులు భారత మార్కెట్‌ను ఆక్రమించనున్నాయి. ఇక్కడి అనేక రంగాల కంపెనీలు మూత పడే ప్రమాదం ఉంది. దీంతో ఉపాధి కల్పన, ప్రజల ఆదాయాలు దెబ్బతిననున్నాయి.

సుప్రీం తీర్పును తారుమారు చేసేలా ప్రశ్నలు

- తమిళనాడు సిఎం స్టాలిన్

చెన్నై : సుప్రీంకోర్టు ఇప్పటికే వెలువరించిన తీర్పును తారుమారు చేసేలా ఉన్న రాష్ట్రపతి ప్రశ్నలకు తీవ్రంగా ఖండిస్తున్నట్టు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. సోషల్ మీడియాలో ఈ అంశంపై ఆయన స్పందించారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి బిజెపి చెప్పినట్టు వ్యవహరించారనే వాస్తవాన్ని ఈ ప్రయత్నం స్పష్టంగా వెల్లడిస్తుందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును ముర్ము ప్రశ్నించడం ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని బలహీనపరిచే ప్రయత్నమని, సుప్రీంకోర్టు అధికారాన్ని ఇది సవాలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు చర్య తీసుకోవడానికి సమయ పరిమితులను నిర్ణయించడంపై



లేవనెత్తిన అభ్యంతరాలను స్టాలిన్ ప్రశ్నించారు. "గవర్నర్లకు సమయ పరిమితులను నిర్ణయించడానికి అభ్యంతరం ఎందుకు ఉండాలి? బిల్లు ఆమోదంలో నిరవధిక జాప్యాలను అనుమతించడం ద్వారా బిజెపి తన గవర్నర్ల అడ్డంకిని చట్టబద్ధం చేయాలని చూస్తుందా? కేంద్ర ప్రభుత్వం బిజెపియేతర రాష్ట్ర శాసనసభలను స్తంభింపజేయాలని అనుకుంటుందా?" అని ప్రశ్నించారు.

"రాష్ట్ర శాసనసభలను నిర్వీర్యం చేయాలనే బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ దుష్ట ఉద్దేశాన్ని ముర్ము ప్రశ్నలు వెల్లడిస్తున్నాయి. అందువల్ల ఇది రాష్ట్ర స్వయంప్రతిపత్తికి ముప్పును కలిగిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని రక్షించడానికి చట్టపరమైన పోరాటంలో చేరాలని అన్ని బిజెపియేతర రాష్ట్రాలు, పార్టీ నాయకులను కోరుతున్నాను. మన శక్తి మేరకు పోరాడుదాం. తమిళనాడు పోరాడుతుంది. తమిళనాడు గెలుస్తుంది!" అంటూ స్టాలిన్ పోస్ట్ చేశారు.

పాక్ అణ్వాయుధాలు భద్రంగా వున్నాయా ?

- అంతర్జాతీయ పర్యవేక్షణ అవసరమన్న రాజ్‌నాథ్ సింగ్

శ్రీనగర్ : ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన తర్వాత మొదటిసారిగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం జమ్మూ కాశ్మీర్‌లో పర్యటించారు. పాకిస్తాన్ అణ్వాయుధాల భద్రతను ఆయన ప్రశ్నించారు. వాటిపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) పర్యవేక్షణ వుండాలని కోరారు. పాక్ నిర్లక్ష్యపూరితమైన వ్యవహార శైలి పట్ల ఆయన తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీనగర్‌లోని బాదామి బాగ్ కంటోన్మెంట్‌లో సైనికులనుద్ధేశించి సింగ్ మాట్లాడారు. అమరులైన సైనికులకు రాజ్‌నాథ్‌సింగ్ శ్రీనగర్‌లో నివాళులర్పించారు. పాకిస్తాన్ అణు బ్లాక్ మెయిలింగ్‌కు తామెన్నటికీ లొంగేది లేదన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలన్న భారత్ కృతనిశ్చయాన్ని పాకిస్తాన్ బాధ్యతారాహిత్యంగా చేసే అణు బెదిరింపులు ఏ రకంగానూ అడ్డుకోలేవని స్పష్టం చేశారు. ఈ దశలో అంతర్జాతీయ సమాజాన్ని ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నా - అసలు అటువంటి బాధ్యత లేని దేశం చేతిలో అణ్వాయుధాలు సురక్షితమేనా అని ప్రశ్నించారు. సైనిక బలగాలతో ముచ్చటించిన రక్షణమంత్రి, ఆపరేషన్ సిందూర్ విజయంపై సైన్యాన్ని ప్రశంసించారు. సైనిక ఉన్నతాధికారులను కలిసి భద్రతా పరిస్థితిని, సాయుధ దళాల పోరాట సంసిద్ధతను సమీక్షించారు. బాదామీ బాఘ్ కంటోన్మెంట్ వద్ద భారత్ విధ్వంసం చేసిన పాక్ డ్రోన్లు, క్షిపణుల శకలాలను పరిశీలించారు. ఆయన వెంట జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కూడా వున్నారు.

బారాముల్లాలో ఆర్మీ చీఫ్ పర్యటన

జమ్మూ కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో సరిహద్దు ప్రాంతాలను ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది సందర్శించారు. నిరంతరం అప్రమత్తంగా వుండాల్సిందిగా ఆయన సైనిక బలగాలను కోరారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో వాస్తవాధీన రేఖ పొడవునా పై చేయి సాధించిన మన బలగాల ధైర్య సాహసాలను ప్రశంసించారు.

అణగారిన వర్గాలకు భయపడే కులగణనకు ప్రధాని అంగీకారం

- రాహుల్ గాంధీ

దర్భంగా: దేశంలో అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే భయంతోనే ప్రధాని మోడీ కులగణనకు అంగీకరించారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాల తరఫున పోరాడుతున్న ప్రతిపక్షానికి ప్రధాని భయపడ్డారని అన్నారు. బీహార్‌లోని దర్భంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా యూనివర్సిటీ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తాను ఇక్కడికి రాకుండా అడ్డుకునేందుకు స్థానిక నేతలు, అధికారులు ఎంతో ప్రయత్నించారని అన్నారు. అన్ని అడ్డంకుల్నీ అధిగమించి వచ్చానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో బీహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీహార్‌లో యువతతో మమేకమయ్యేందుకు తలపెట్టిన 'శిక్షా న్యాయ్ సంవాద్' కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికారపార్టీ నాయకులు, అధికారులు ఎంతో ప్రయత్నించారు. యూనివర్సిటీ గేటు బయటే నా కారును నిలిపివేశారు. బీహార్ ప్రభుత్వం నన్ను ఎందుకు ఆపలేకపోయిందో తెలుసా? మీ



అందరి అభిమానమే నన్ను ముందుకు నడిపించింది. ఇదే శక్తి నరేంద్ర మోడీని గద్దె దించుతుంది. ప్రతిపక్షాల డిమాండ్ మేరకే కులగణను మోడీ అంగీకరించారు. ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసు" అని అన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అంబానీ, అదానీల కోసమే పని చేస్తోందని రాహుల్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో చేపట్టిన విధంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, ప్రయివేటు కళాశాలలు, యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడలు వంచైనా వీటిని సాకారం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం పోరాటం

- మోడీని సాగనంపేందుకు యువత నడుం బిగించాలి
- ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలో డి.రాజా, కె.నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం పోరాటానికి యువతను సమాయత్తం చేయాలని, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్న మోడీని సాగనంపేందుకు యువత నడుం బిగించాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. తిరుపతి వేదికగా ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు గురువారం ప్రారంభమయ్యాయి. తిరుపతి ఇందిరా మైదానంలో ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు సికిందర్‌సింగ్ మహేశ్వరి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. రాజా మాట్లాడుతూ..ఉపాధి హక్కును ప్రాథమిక హక్కుగా చేర్చాలని డిమాండ్ చేశారు. విద్య, ఉపాధి కోసం వేలాదిమంది నిరుద్యోగ యువత ఆందోళనలు చేస్తున్నప్పటికీ నరేంద్ర మోడీకి చీమకుట్టినట్టు కూడాలేదని విమర్శించారు. భగత్ సింగ్ జాబ్ గ్యారంటీ యాక్ట్‌ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 'సేవ్ ఇండియా చేంజ్ ఇండియా' పేరుతో దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించాలని అందులో ఎఐవైఎఫ్ అగ్రభాగాన నిలవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థగా నడవాలని, రాజకీయాల కతీతంగా ఉండాలని సూచించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి



బహిరంగసభలో అభివాదం చేస్తున్న నేతలు

కె.నారాయణ మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థను కూడా శాసించే స్థాయికి రాష్ట్రపతి వచ్చారంటే బిజెపి విధానాలు ఏ స్థాయికి చేరాయో గుర్తించాలన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని, మత సామరస్యాన్ని కాపాడుకోవాలంటే యువత ముందుకొచ్చి పేద, బడుగు బలహీన తరగతుల తరఫున పోరాడాలని కోరారు. రాజ్యసభ సభ్యులు సంతోష్‌కుమార్ మాట్లా డుతూ... మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తూ బిజెపి మత విద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు. సికిందర్‌సింగ్ మహేశ్వరి మాట్లా డుతూ.. నాలుగురోజులపాటు తిరుపతి వేదికగా మహాసభలు జరుగుతాయన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమల రామన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి, జీ.ఈశ్వరయ్య పాల్గొన్నారు.

దక్షిణాసియా దేశాలపై ట్రంప్ పెత్తనమేంటి?

'దక్షిణాసియా దేశాలపై ట్రంప్ పెత్తనమేంటి?' అని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రశ్నించారు. ట్రంప్‌నకు భారత ప్రధాని తలొగ్గి వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. తిరుపతి సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పాకిస్తాన్ నుంచి వచ్చిన ఉగ్రమూకలు అమాయక ప్రజలను చంపడం అత్యంత హేయమైన చర్యన్నారు. అలాంటి ఉగ్రవాదాన్ని సమూలంగా రూపుమాపేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిలో అనేక లోపాలు ఉన్నాయన్నారు. ఉగ్రవాదులను తుదముట్టించే క్రమంలో భారత్, పాక్‌లు ప్రకటించకముందే అమెరికా అధ్యక్షులు కాల్పుల విరమణపై స్పందించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పెహల్గాం ఘటనపై పూర్తిస్థాయిలో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ జాతీయ మహాసభల సందర్భంగా తిరుపతి నగరంలో పెరియార్ సిద్ధాంతంతో కూడిన చిత్రపటాలను పోలీసులు తొలగించడం శోచనీయమన్నారు. ద్రవిడ ఉద్యమానికి, సామాజిక న్యాయం కోసం పెరియార్ చేసిన పోరాటం చంద్రబాబుకు బాగా తెలుసునని ఈ విషయమై తక్షణమే స్పందించాలని కోరారు.

పోక్సో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు

- కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : చిన్నారులపై జరిగే లైంగిక నేరాల కేసులను మాత్రమే ప్రత్యేకంగా విచారించేందుకు పోక్సో కోర్టులను అత్యంత ప్రాధాన్యతా ప్రాతిపదికన ఏర్పాటు చేయాల్సిందిగా సుప్రీంకోర్టు గురువారం కేంద్రాన్ని ఆదేశించింది. లైంగిక నేరాలకు వ్యతిరేకంగా చిన్నారుల రక్షణ (పోక్సో) చట్టం కేసులకు ప్రత్యేక కోర్టుల సంఖ్య ఎక్కువగా లేనందున విచారణలు పూర్తి చేయడానికి చట్టం కింద నిర్దేశించబడిన కాల పరిమితులకు కట్టుబడి వుండడం లేదని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పి.బి.వరాలెలతో కూడిన బెంచ్ పేర్కొంది. అందువల్ల పోక్సో కేసులను దర్యాప్తు చేసే అధికారులను చైతన్యపరచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు బెంచ్ పేర్కొంది. అధిక ప్రాధాన్యతా ప్రాతిపదికన పోక్సో కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని కూడా కోరింది. చట్టంలో నిర్దేశించిన కాలపరిమితి లోపలే విచారణలు పూర్తయ్యేలా చూడడంతో పాటూ నిర్దిష్ట కాల వ్యవధిలోనే చార్జిషీట్‌లు దాఖలు చేయాలని కూడా సుప్రీం కోర్టు ఆదేశించింది. కేంద్రం నుండి అందిన నిధులతో పోక్సో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలనే ఆదేశాలను మెజారిటీ రాష్ట్రాలు పాటించినప్పటికీ తమిళనాడు, బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, మహారాష్ట్రల్లో ఇటువంటి కేసులు పెండింగ్‌లో వున్నందున ఇక్కడ మరిన్ని పోక్సో కోర్టులు ఏర్పాటు చేయాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. బాలలపై అత్యాచార సంఘటనలు ఆందోళనకరమైన రీతిలో పెరుగుతుండడాన్ని సుమోటో కేసులో సుప్రీంకోర్టు విచారిస్తూ ఈ ఆదేశాలు జారీ చేసింది. 300కి పైగా కేసులు పెండింగ్‌లో వున్న చోట జిల్లాల్లో రెండు కోర్టులను ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు రాష్ట్రాలను ఆదేశించింది.

కాలపరిమితి విధించవచ్చా?

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టికల్ 361 అవరోధంగా ఉన్నదా? రాజ్యాంగపరంగా కాలపరిమితి ఏదీ సూచించనప్పుడు, గవర్నర్ ఏ విధంగా అధికారాలను ఉపయోగించుకోవాలో నిర్దేశించనప్పుడు ఆర్టికల్ 200 ప్రకారం ఉన్న అన్ని అధికారాలను ఉపయోగించుకోవడానికి న్యాయపరమైన ఆదేశాల ద్వారా కాలక్రమాలను విధించవచ్చా, అధికారాలను ఎలా ఉపయోగించుకోవాలో నిర్దేశించవచ్చా?

రాష్ట్రపతి ఏం చేయాలి?

రాజ్యాంగంలోని 201వ అధికరణ కింద రాష్ట్రపతి రాజ్యాంగపరమైన విచక్షణను ఉపయోగిం చడం న్యాయబద్ధమేనా? రాజ్యాంగపరంగా కాలక్రమాన్ని సూచించనప్పుడు, రాష్ట్రపతి ఏ విధంగా అధికారాలను ఉపయోగించుకోవాలో నిర్దేశించన ప్పుడు ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి తన విచక్షణను ప్రదర్శించి న్యాయపరమైన ఆదేశాల ద్వారా కాల క్రమాలను విధించవచ్చా, అధికారాలను ఉపయోగిం చుకోవచ్చా? రాష్ట్రపతి ఆమోదం కోసం గవర్నర్ బిల్లును తన వద్ద అట్టే పెట్టుకున్నప్పుడు లేదా ఇతర కారణాలతో అట్టే పెట్టుకున్నప్పుడు ఆర్టికల్ 143లో పేర్కొన్న విధంగా రాష్ట్రపతి సుప్రీంకోర్టు అనుమతిని, అభిప్రాయాన్ని తీసుకోవాలా? ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్, ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి తీసుకునే నిర్ణయాలు చట్టానికి ముందు అమలులోకి వచ్చిన దశలో న్యాయబద్ధమేనా, బిల్లు చట్టంగా మారడానికి ముందు దానిలోని అంశాలపై కోర్టులు న్యాయపరమైన తీర్పులు ఇవ్వవచ్చా?

న్యాయస్థానాల కర్తవ్యం ఏమిటి?

రాజ్యాంగపరంగా రాష్ట్రపతి లేదా గవర్నర్‌కు ఉన్న అధికారాలను, వారు జారీ చేసే ఆదేశాలను రాజ్యాంగంలోని 142వ అధికరణ కింద మార్చవచ్చా? రాష్ట్ర శాసనసభ రూపొందించిన చట్టాన్ని ఆర్టికల్ 200 కింద గవర్నర్ అనుమతి లేకుండా అమలు చేయవచ్చా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 145 (3)లోని నిబంధన ప్రకారం... న్యాయస్థానంలోని ఏ బెంచ్ అయినా తన ముందుకు వచ్చిన కేసులో రాజ్యాంగ వివరణలకు సంబంధించిన చట్టపరమైన ప్రశ్నలు ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని ముందుగా నిర్ణయించడం, దానిని కనీసం ఐదుగురు సభ్యుల బెంచ్‌కు నివేదించడం తప్పనిసరి కాదా? కోర్టు వ్యవస్థ చట్టపరమైన అంశాలను ఏ విధంగా పరిష్కరించాలనే విషయంపై నియమ నిబంధనలు ఉన్నాయి. ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు అధికారాలు ఆ నియమ నిబంధనలకే పరిమితమవుతాయా? లేక వాటికి విరుద్ధంగా ఆదేశాలు జారీ చేస్తాయా? ఆర్టికల్ 131 కింద వేసే వ్యాజ్యం ద్వారా మినహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టుకు ఉన్న మరే ఇతర అధికార పరిధిని రాజ్యాంగం నిషేధిస్తుందా?' అని రాష్ట్రపతి ప్రశ్నించారు.

20 నుంచి సమైక్యతా యాత్రలు

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత నిలదొక్కుకుంటుందని ప్రజలు, కార్మికుల్లో ఉన్న ఆశలు నేడు సన్నగిల్లుపోతున్నాయని తెలిపారు. 2025లో ప్యాకేజీ ఇచ్చి 2026లో ప్లాంట్‌ను మూసెయ్యడానికి పథకం వేశారని తాజాగా ప్లాంట్‌లో చేపడుతున్న నిర్బంధ చర్యలు స్పష్టం చేస్తున్నాయన్నారు. కార్మికులను నిత్యం వేధిస్తూ ఎలా వంద శాతం ఉత్పత్తిని యాజమాన్యం సాధిస్తుందని ప్రశ్నించారు. ఈ నెల 13న మధ్యాహ్న భోజన సమయంలో ప్లాంట్‌లో మీటింగు పెట్టుకుంటే ఏడుగురు కార్మికులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి, నలుగురిని సస్పెండ్ చేశారని, ఇది తీవ్రమైన చర్యని పేర్కొన్నారు. తక్షణమే నిర్బంధ చర్యలు ఆపి పూర్తిస్థాయి ఉత్పత్తి జరిగేలా యూనియన్లతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

ఆపరేషన్ సిందూర్ తరువాత దేశాన్ని మోడీ నడుపుతున్నారా ? ట్రంప్ నడుపుతున్నారా ? అన్న చర్చ ప్రజల్లో జరుగుతోందని శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. ప్రతి అంశాన్నీ ట్రంప్ ప్రకటిస్తున్నారని అన్నారు. 16, 17, 18 తేదీల్లో తిరంగ యాత్రలను కూటమి పార్టీలు చేస్తాయంటున్నాయని, జాతీయ జెండాను మోసే హక్కు ఈ పార్టీలకుందా ? అని ప్రశ్నించారు. తెలుగుదేశం లౌకిక పార్టీగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, జాతీయ స్థాయిలో బిజెపి పిలుపు ఇస్తే టిడిపి కలవడమేమిటి ? బిజెపిలో టిడిపిని విలీనం చేసేస్తారా ? అని ఆగ్రహించారు. జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా మన సార్వభౌమత్వాన్ని అమెరికాకు బిజెపి తాకట్టు పెట్టిందన్నారు.

పవన్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం.

దేశ సైన్యానికి మతం లేదని దేశ రక్షణ శాఖ ప్రకటన చేస్తే జనసేన అధినేత పవన్ కల్యాణ్ దాన్ని పక్కనపెట్టి హిందువులపై దాడి జరిగిందంటూ.. ముస్లిం, క్రిస్టియన్‌ల పేరుచెప్పి విడగొట్టేలా వ్యాఖ్యలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. దేశమంతా ఒక్కటిగా ఉండాలని ప్రజలు కోరుతుంటే దేశ సమైక్యతను బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులతో జతకూడి పవన్ బలహీనం చేస్తున్నారని అన్నారు.

20న వక్ఫ్ సవరణలపైనే విచారణ

- జస్టిస్ గవాయ్ బెంచ్ నిర్ణయం

న్యూఢిల్లీ : వక్ఫ్ (సవరణ) చట్టం, 2025 నిబంధనల అమలుపై స్టే విధిస్తూ జారీ చేసిన తాత్కాలిక ఆదేశాలకు అనుకూలంగా, వ్యతిరేకంగా చేసే వాదనలను మే 20వ తేదీన మొత్తంగా వినాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసిలతో కూడిన ధర్మాసనం నిర్ణయించింది. ఈ కేసు వాయిదా పడకుండా వుండేలా చూసేందుకు గానూ ముందస్తుగానే తమ వాదనలు, వివరాలతో సమగ్రంగా నోట్ సిద్ధం చేసుకుని అందజేయాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తి గవాయ్ న్యాయవాదులను కోరారు. మంగళవారం (20వ తేదీ)నాడు మరే ఇతర అంశాలను విచారణకు చేపట్టబోమని ఆయన న్యాయవాదులనుద్ధేశించి అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే గవాయ్ బెంచ్ ముందుకు వక్ఫ్ చట్టం సవాలు చేసిన అంశం వచ్చింది. ఈ కేసు పత్రాలను అధ్యయనం చేయడానికి బెంచ్‌కు తగినంత సమయం ఇస్తూ వచ్చే వారానికి విచారణను పెట్టుకోవాల్సిందిగా ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, పిటిషనర్ల తరపున వాదనలు వినిపించే సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ సూచించారు. ఈ కేసు ఈ నెల 5న అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ముందుకు చివరిసారిగా విచారణకు వచ్చింది. ఈ కేసు విచారణను కొనసాగించడానికి జస్టిస్ ఖన్నా తిరస్కరించారు. తాను 13న పదవీ విరమణ చేస్తున్నందున తనకు సమయం తక్కువగా వుందంటూ విచారణకు సిద్ధపడలేదు. ఈ నెల 15న తదుపరి విచారణకు వాయిదా వేశారు. వక్ఫ్ చట్టానికి చేసిన సవరణల అమలుపై స్టే విధిస్తూ ఇచ్చిన తాత్కాలిక ఆదేశాలపై ఇరు పక్షాల వాదనలను విచారించాల్సి వుంది. సమయాభావం వల్ల వాయిదా వేశారు. ఇప్పటివరకు ఈ కేసులో వందకు పైగా పిటిషన్లు దాఖలయ్యాయి. ఇంకా చాలా వస్తున్నాయి. పిటిషన్లు, కోర్టులో పదేపదే వాదనలు నివారించేందుకు సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించింది.




ట్రంప్‌తో ముకేష్ అంబానీ భేటీ

దోహా : రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. ట్రంప్ కోసం ఖతార్ అమీర్ దోహాలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ విందుకు ముకేష్ అంబానీ హాజరయ్యారు. ట్రంప్ ఎన్నికైన తర్వాత ఆయనతో ఇది రెండోసారి భేటీ. ఈ ఏడాది జనవరిలో ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో వంద మందికి ఇచ్చిన ప్రత్యేక విందులో నీతా అంబానీ, ముకేష్ అంబాని పాల్గొన్నారు. రష్యా నుంచి ముడిచమురును రిలయన్స్ దిగుమతి చేసుకొని, పెట్రోలు వంటి ఇంధనాలు తయారుచేసి వాటిని అమెరికాకు విక్రయిస్తోంది. గూగుల్, మెటా వంటి అమెరికా దిగ్గజాలకు రిలయన్స్ జియోలో వాటాలున్నాయి. ఖతార్‌తోనూ రిలయన్స్‌కు వ్యాపార సంబంధాలున్నాయి. ఈ క్రమంలో ట్రంప్‌తో ముకేష్ అంబానీ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది.

శాంతి చర్చలకు హాజరైన రష్యా, ఉక్రెయిన్ బృందాలు

అంకారా : ఇస్తాంబుల్‌లో జరగనున్న శాంతి చర్చలకు రష్యా, ఉక్రెయిన్ బృందాలు హాజరయ్యాయి. ప్రస్తుతం తాము చర్చలకు సిద్ధమేనని, సాధ్యమైన రాజీలకు కూడా సిద్ధంగా వున్నామని పుతిన్ సహాయకుడు వ్లాదిమిర్ మెదిన్‌స్కీ చెప్పారు. తాము వర్కింగ్ మూడ్‌లో వున్నామని ఆయన వ్యాఖ్యానించారు. తమ ప్రతినిధి బృందంలో సంబంధిత ప్రభుత్వ విభాగాల సీనియర్ అధికారులు కూడా వున్నారని తెలిపారు. ఈ చర్చలకు అధ్యక్షుడు పుతిన్ హాజరు కాబోరని క్రెమ్లిన్ ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ నేతృత్వంలో ఉక్రెయిన్ ప్రతినిధి బృందం టర్కీ రాజధాని అంకారా చేరుకుంది. తొలుత 30 రోజుల కాల్పుల విరమణకు అంగీకరించకపోతే మాస్కోతో చర్చలు జరిపేది లేదని జెలెన్‌స్కీ పట్టుబట్టారు. ఈ చర్చలకు తమ మద్దతు వుంటుందని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో జెలెన్‌స్కీ తన వైఖరి మార్చుకున్నారు. ఇస్తాంబుల్ చర్చలకు హాజరయ్యారు.



సీత కోరిక



రామాపురం గ్రామంలో సీత అనే అమ్మాయి వుంది. సీతకు బొమ్మలు గీయడం అంటే చాలా ఇష్టం. మంచి, మంచి బొమ్మలు వేసి గొప్ప చిత్రకారిణి కావాలన్నది తన కోరిక. కానీ సీత వాళ్లింట్లో తనని బడికి పంపించడమే దండగ అనుకునేవారు. బొమ్మలు వేయడాన్ని అస్సలు ప్రోత్సహించరు. ఒక రోజు సీత కూరగాయల షాపు నుండి ఇంటికి వస్తుండగా రోడ్డు మీద ఒక కాగితం కనిపించింది. దానిలో చిత్రాలు వేసే పోటీ ప్రకటన చూసింది. అది చూసి ఎంతో సంతోషించింది. తనలోని సృజనని బయటికి తీసి అందమైన బొమ్మని గీసింది.

మరుసటి రోజు స్కూలుకి త్వరగా వెళ్లింది. బొమ్మ గీసిన కాగితాన్ని మాస్టారికి ఇచ్చింది. అది చూసి మాస్టారు చాలా ఆశ్చర్యపోయారు. 'ఈ బొమ్మ గీసింది నువ్వేనా! చాలా బాగుంది. దీన్ని తప్పకుండా పోటీకి పంపిస్తా' అన్నారు.



ఆ చిత్రాన్ని మాస్టారుకి ఇచ్చి సీత గట్టిగా ఏడ్చింది. 'ఏమైంద'ని మాస్టారు కంగారుగా అడిగారు. వచ్చే ఏడాది తనని స్కూలు మాన్పించి, పనికి పంపుదామని అమ్మానాన్న అనుకుంటున్న సంగతి ఏడుస్తూ చెప్పింది. అప్పుడు మాస్టారికి సీత గీసిన బొమ్మకి ప్రోత్సాహం ఇవ్వడం ఎంత ముఖ్యమో అర్థమైంది. వెంటనే దాన్ని పోటీకి పంపారు.

సీతకు రాష్ట్రస్థాయిలో బహుమతి వచ్చింది. మాస్టారు బహుమతి వచ్చిన విషయం సీత తల్లిదండ్రులతో స్వయంగా చెప్పారు. బడికి పంపిస్తే తను ఇంకెన్నో బహుమతులు గెలుచుకుంటుందని అన్నారు. సీత అమ్మానాన్నలో మార్పు వచ్చింది. తనని స్కూలు మాన్పించకుండా పంపించేందుకు సిద్ధమయ్యారు. కొద్ది రోజుల్లోనే సీత గొప్ప చిత్రకారిణిగా పేరు తెచ్చుకుంది. అమ్మానాన్నకి, తనను ప్రోత్సహించిన ఉపాధ్యాయుడికి మంచి పేరు తెచ్చింది.



- అక్షయ, 9వతరగతి,
జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,
రాజగోపాల్ పేట,
నంగునూరు మండలం,
సిద్దిపేట జిల్లా,
78429 06949

పరివర్తన



గట్లమల్యాల గ్రామానికి ఆనుకొని పెద్దడవి ఉంది. అడవిలో చాలా జంతువులు ఉన్నాయి. చెట్టు పైన కట్లపాము, అడవిలో సింహం, చెరువులో మొసళ్లు మంచి స్నేహితులుగా ఉంటాయి. ఎవరికి ఏ ఆపద వచ్చినా ఒకదాన్ని మరొకటి కాపాడుకునేవి. ఒక రోజు చెరువుగట్టున గల పెద్ద మర్రిచెట్టు కింద కూర్చొని భవిష్యత్తు గురించి కబుర్లు చెప్పుకున్నాయి. అప్పుడు సింహం ఇలా అన్నది 'స్నేహితులారా! మనం ఈ అడవిని కాపాడుకోవాలి. అడవిపచ్చగా ఉంటేనే మనం బతకగలుగుతాం. చెరువులో నీళ్లు ఉంటాయి. మనకు కావలసినటువంటి పండ్లు దొరుకుతాయి' అని సింహం అన్నది. ఇప్పుడిప్పుడే మన అడవిపై దొంగల కన్ను పడింది. అడవిని నరికి డబ్బులు సంపాదించాలని చూస్తున్నారు. మనం జాగ్రత్తగా ఉండాలి. దొంగలపై ఒక కన్నువేసి ఉంచాలి' అని స్నేహితులను హెచ్చరించింది.


చాలా రోజులు గడిచాయి. భూమేశ్ ఏ జంతువు కంటబడకుండా అడవిలోకి ప్రవేశించాడు. మొసళ్ళు నివసించే చెరువు గట్టున గల మర్రిచెట్టును చూశాడు. గొడ్డలితో సగం వరకు నరికాడు. ఈ విషయాన్ని సింహం పసిగట్టింది. వెంటనే అతనిపై దాడిచేయబోయింది. భయంతో చెట్టుపైకెక్కాడు. ఈ విషయాన్ని పాము గ్రహించింది. అతనిని కరువబోయింది. వణుకుతూ చివరి కొమ్మవరకు పారిపోయాడు. కొమ్మ విరిగి ఉగులాడాడు. వెంటనే చెరువులోని మొసళ్ళు ఇతనిని పట్టుకుందామని పైకెగిరాయి. అన్నీ ఒక్కసారిగా మీద పడేసరికి భూమేశ్ వాటిని క్షమాపణ అడిగాడు. ప్రాణం కాపాడినందుకు 'ఇక నుండి అడవికి కాపలాగా ఉంటాన'ని మాట ఇచ్చాడు. 'అడవిలో దొరికిన ఎండు పుల్లలను అమ్ముకుంటూ జీవిస్తాన'ని చెప్పాడు. భూమేశ్‌లో వచ్చిన పరివర్తనకి ముగ్గురు స్నేహితులు ఎంతో సంతోషించాయి.






- బండి సాయిశివ,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
బక్రిచెప్యాల సిద్దిపేట జిల్లా,

బొమ్మల కొలువు





పి.సంతోష్,
7వ తరగతి,
ఎం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాల,
మహానంది (మం),
నంద్యాల జిల్లా.





కె.ప్రవీణ్య,
5వ తరగతి,
లిటిల్ ఫ్లవర్ స్కూలు,
విద్యానగర్,
గుంటూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

జీవన సౌరభం

గమ్యం స్థిరంగా ఉండాలి.
మార్గం కచ్చితంగా నిర్ణయించుకోవాలి.
ప్రయత్నం రాజీలేని ధోరణిలో సాగాలి.
అప్పుడే విజయం మనదవుతుంది.

పోషకాహారంతోనే ఆరోగ్యం...

పోషకాహారం అంటే శరీరానికి అవసరమైన పోషకాలను అందించే ఆహార పదార్థాల కలయిక. ఇది జీవనానికి అవసరమైన శక్తి, పెరుగుదల ఆరోగ్యానికి మద్దతును అందిస్తుంది. పోషకాహారం ద్వారా మనం తీసుకునే ఆహారం ద్వారా శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుంది. ముఖ్యంగా పిల్లల పెరుగుదలకు పోషకాహారం చాలా అవసరం. పోషకాహారం లోపం ఉంటే వివిధ రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. శరీరంలోని అవయవాలు, వ్యవస్థలు సరిగ్గా పనియేయటానికి పోషకాలు అవసరం. మాంసకృత్తులు, పిండిపదార్థాలు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు, నీరు వంటివి ఆరోగ్యానికి బాగా దోహదపడతాయి.



రోజు మొత్తంలో ఎంత బిజీగా ఉన్నా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం కోసం ఎంతోకొంత సమయాన్ని కేటాయించాల్సిందే. ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలి. శరీరానికి తగినంత విశ్రాంతి ఉండాలి. ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలి. ఏదీ అతిగా చేయకూడదు. తినకూడదు. తాగకూడదు. మనలో చాలామంది ఆకలి వేసినప్పుడు కడుపు నింపుకోవటానికి ఏది అందుబాటులో ఉంటే అది తినేస్తుంటాం. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండేందుకు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని రకాల ఆహారాలను ప్రతిరోజూ తీసుకోవాలి. అలా చేస్తే ఆరోగ్యంగా ఉంటాం. ఆరోగ్యంగా ఉంటేనే మంచి నిద్ర పడుతుంది. అవసరమైన నిద్ర, సరైన ఆహారం ఇవే ఎక్కువ కాలం జీవించేలా చేస్తాయి. పోషకాహారం ఎందులో ఉందో తెలుసుకోవటం ఉత్తమం. కొన్ని రకాల ఆహారాల్లో ఎక్కువ పోషకాలుంటాయి. మరికొన్నింటిలో తక్కువగా ఉంటాయి. శరీరంలోని అవయవాలు, వ్యవస్థలు సరిగ్గా పనిచేయటానికి పోషకాలు అవసరం. పోషకాహారంలో ఉండే ముఖ్యమైన పోషకాలు అనేక రూపాల్లో దొరుకుతాయి.

అవసరానికి మించి తినొద్దు

శరీరానికి శక్తి నిచ్చే ఆహారాన్ని తీసుకోవటం మేలు. మోతాదుకు మించి తీసుకోకూడదు. అంటే సరిపడా కేలరీలు ఉన్న ఆహారాన్నే తీసుకోవాలి. ఎన్ని కేలరీలు అవసరమనేది తెలుసుకుని తీసుకోవటం మంచిది. ఎందుకంటే బరువు తక్కువగా ఉన్న వారు ఎక్కువ కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఎక్కువ బరువు ఉన్న వారు తక్కువ కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ప్రస్తుత జీవన విధానంలో సాధారణ బరువు ఉండే వారికి ప్రతిరోజు 1600 నుంచి 1800 కేలరీలు ఉండే ఆహారం అవసరం అవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అనునిత్యం తాజా పండ్లతోపాటు డ్రైఫ్రూట్స్, పెరుగు పదార్థాలను తీసుకుంటే శరీరానికి ఫైబర్, ప్రొటీన్లతోపాటు మంచి కేలరీలు అందుతాయని సూచిస్తున్నారు.

కేలరీలను అవసరాన్ని బట్టే తీసుకోవాలి

శరీరంలో కేలరీల శాతం ఎక్కువగా ఉంటే వాటిని తగ్గించుకునేలా ఆహారాన్ని ఎంపిక చేసుకోవాలి. ఇలాంటి వారు పంచదార, స్వీట్లు, ఫ్రైఫుడ్, కూల్‌డ్రింకులు, కేకులు, ఐస్‌క్రీములు, పిజ్జాలు, బర్గర్లు, ఆల్కాహాల్ వంటివి తీసుకోకూడదు. చిన్న పిల్లలకు పాలిచ్చే తల్లులు, గర్భవతులకు పోషకాలు అధికంగా అవసరం. అందువల్ల వారి ఆహారంలో ఎక్కువ కేలరీలు ఉండేలా చూడాలి. వారు పాలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలి. మధుమేహం ఉన్న వారికి సరిపడా కేలరీలు ఉన్న ఆహారమే ఇవ్వాలి. టీబీ ఉన్న వారు అత్యధిక కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఎవ్వరికి వారు తాము చేసే పనిని బట్టి కూడా కేలరీల అవసరం మారుతూ ఉంటుంది. ఎక్కువగా పనిచేసే వారు ప్రతిరోజూ 2200 కేలరీల ఆహారాన్ని తీసుకోవచ్చు.

పిండిపదార్థాలు మేలు

ప్రతి ఒక్కరూ తమ శరీరానికి సరిపడా శక్తి కావాలంటే తినే భోజనంలో పిండి పదార్థాలు, ప్రొటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు, నీరు సమపాళ్లలో ఉండేలా చూసుకోవాలి. అతిగా వద్దు. ఏదైనా సరిపడా తీసుకోవటం ఉత్తమం. రోజూ తినే అన్నం, చపాతీలను ఏదో ఒక పప్పుతో కలిపి తీసుకుంటే మంచిది. పిండి పదార్థాలకు ప్రొటీన్‌ను జతచేసినట్లే అవుతుంది.

మాంసాహారమూ మంచిదే...

శరీరానికి కావాల్సిన కేలరీలు మాంసాహారంలో అధిక మొత్తంలో ఉంటాయి. వీటిలో ఎక్కువగా ఉండే కొవ్వులు శరీరంలోకి చేరతాయి. ఇలా కొవ్వు శరీరంలోకి పేరుకుపోవటం అంత మంచిదికాదు. అందువల్ల వారానికి ఒకసారో, రెండుసార్లో తినాలి. శరీరానికి కావాల్సిన ప్రొటీన్లు, ఎ,డి, ఇ విటమిన్లు, కొవ్వులు ఉండే కోడిగుడ్లను ఆహారంలో భాగంగా చేసుకోవటం మేలు. బ్రెడ్ కూడా అదనపు బలం కోసం తోడ్పడుతుంది. ప్రతి బ్రెడ్ స్లైస్‌లో 69 కేలరీలు ఉంటాయి.

డ్రైఫ్రూట్స్ మంచిదే!

ప్రతిరోజూ సాయంత్రం పూట ఏదో ఒక పండును తినటం ఎంతైనా మంచిదే. ఆకలి తీరకపోతే చిప్స్, బిస్కెట్లు, కేకులు, మిర్చీ బజ్జీలు, ఉప్పు కలిపిన పదార్థాలు కొందరు తింటుంటారు. అయితే ఇలాంటి వాటికి బదులుగా బాదంపప్పు, పిస్తాపప్పు, జీడిపప్పు, వాల్‌నట్స్ లాంటివి తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. ఇవే కాకుండా పెరుగుతో చేసిన పదార్థాలు, మజ్జిగ లాంటివి తీసుకుంటే శరీరానికి ప్రొటీన్లు, మంచి కొవ్వులు లభించి అదనపు శక్తిని ఇస్తాయి. యాపిల్ పండుతోపాటు మరికొన్ని వాల్‌నట్స్ వంటివి తీసుకుంటే ఆకలితోపాటు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

సీజనల్ ఫ్రూట్స్‌తో బలం

ఆయా సీజన్లలో వచ్చే తాజాపండ్లు తినడం ఎంతో మేలు. ప్రస్తుతం మామిడి, నేరేడు, పనస వంటి పండ్లు విరివిగా లభిస్తున్నాయి. ప్రతి ఒక్కరూ ఉదయమో, సాయంత్రమో ఏదో ఒక సమయంలో రోజులో ఒకటో రెండో పండ్లు తీసుకోవటం ఆరోగ్యపరంగా ఎంతో మేలు చేస్తుంది. అవి శరీరానికి శక్తిని అందిస్తాయి. మార్కెట్లో అనేక రకాల పండ్లు అందుబాటులో ఉంటున్నాయి. పండ్లలో అనేక రకాల పోషకాలు ఉంటాయి. వీటితోపాటు విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు దండిగా లభిస్తాయి. మామిడి, బొప్పాయి, అరటి వంటి లేత పసుపు రంగు ఉండే పండ్లలో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. బత్తాయి,నారింజ వంటి పండ్లతో మంచి ఆరోగ్యం మెరుగుదల అవుతుంది. ఇవి తీసుకుంటే జలుబు చేస్తుందనేది అపోహ మాత్రమే. అది నిజం కాదని వైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మొలకెత్తే గింజల్లోనూ పోషకాలు

తాజా పండ్లతోపాటుగా మొలకెత్తిన గింజలు తిన్నా శరీరానికి అదనపు శక్తి చేకూరుతుంది. శాకాహారం తినేవారిలో బీ12 లోపం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వారు ఉసిరి, క్యారెట్, ఖర్జూరం వంటి డ్రైఫ్రూట్స్‌ను తీసుకుంటే రకరకాల పోషకాలు శరీరానికి లభిస్తాయి.

'ఉస్తాద్...' షూటింగులో పవన్ కళ్యాణ్



జూన్ 12 నుంచి 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా షూట్‌లో పవన్ కల్యాణ్ పాల్గొననున్నట్లు తెలుస్తోంది. 28 రోజుల పాటు 'ఓజీ' షూట్‌లో పాల్గొన్న తర్వాత, 'ఉస్తాద్..' సినిమాను కూడా కంప్లీట్ చేయాలని చూస్తున్నారని సమాచారం. 'ఉస్తాద్..' కోసం అన్నీ రెడీ చేశామని పవన్ కల్యాణ్ రావడమే ఆలస్యం' అంటూ దర్శకుడు హరీష్ శంకర్ తెలిపారు. ఆయన చెప్పిన దాని ప్రకారం జూన్ నుంచి జులై చివరి వరకు పవన్ కల్యాణ్‌పై కీలక సీన్లు షూట్ చేసే అవకాశం ఉందని కనిపిస్తోంది.



'రాపో 22' టైటిల్ ఇదే.. 'ఆంధ్రా కింగ్ తాలుకా'

రామ్ పోతినేని హీరోగా మహేశ్‌బాబు పి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాపో 22' చిత్రానికి టైటిల్ ఖరారు చేశారు. గురువారం రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ టైటిల్‌ను రివీల్ చేశారు. ఈ చిత్రానికి 'ఆంధ్రా కింగ్ తాలుకా' ఖరారు చేసినట్లు ప్రకటిస్తూ గ్లింప్స్ కూడా విడుదల చేశారు. 'బయోపిక్ ఆఫ్ ఏ ఫ్యాన్' అనేది ట్యాగ్ లైన్. ఇందులో సాగర్‌గా రామ్, మహాలక్ష్మిగా భాగ్యశ్రీ బోర్సే కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఉపేంద్ర కీలక పాత్ర పోషించనున్నారు. కథలో ఉపేంద్ర హీరో కాగా.. ఆయన్ని అభిమానించే వ్యక్తిగా రామ్ ఇందులో కనిపించనున్నట్లు తెలుస్తోంది. రామ్ హీరోగా నటిస్తున్న 22వ సినిమా ఇది. ఇప్పటికే ఒక షెడ్యూల్ పూర్తి చేసుకుంది. మైత్రీ మూవీస్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

దాదా సాహెబ్ ఫాల్కేగా ఎన్‌టీఆర్



భారతీయ సినిమా పితామహుడు దాదా సాహెబ్ ఫాల్కే పాత్రలో ఎన్టీఆర్ కనిపించనున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. రెండేళ్ల క్రితం రాజమౌళి సమర్పణలో 'మేడ్ ఇన్ ఇండియా' అనే బహు భాషా చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. దీన్ని ఆయన తనయుడు కార్తికేయ, వరుణ్ గుప్తా సంయుక్తంగా నిర్మిస్తున్నట్లు, నితిన్ కక్కర్ దర్శకుడని ప్రకటించారు. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి వార్తలు ట్రెండ్ అవుతున్నాయి. దాదాసాహెబ్ ఫాల్కే జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. అందులో ఎన్టీఆర్ నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ సినిమాకు తారక్ పచ్చ జెండా ఊపారని బాలీవుడ్ మీడియా పేర్కొంది. 'స్క్రిప్ట్ విని ఆశ్చర్యపోయారు. ఈ కథ భారతీయ సినిమా పుట్టుక. అది ఎదిగిన తీరును ప్రపంచానికి చూపనుంది. ఈ పాత్రలో నటించడానికి ఎన్టీఆర్ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. టీమ్ మొత్తం దీనిపై ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. దీనిపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఫైనల్ స్క్రిప్ట్ కూడా లాక్ అయింది' అని ఆ నిర్మాణ సంస్థ చెప్పినట్లు బాలీవుడ్ మీడియా ఓ కథనంలో పేర్కొంది.



ఆనంద్ దేవరకొండ కొత్త సినిమా ప్రారంభం

బేబీ మూవీతో సూపర్ హిట్ కొట్టిన జోడీ ఆనంద్ దేవరకొండ- వైష్ణవి చైతన్య. వీరిద్దరి క్రేజీ కాంబో మరోసారి రిపీట్ కానుంది. ఆనంద్, వైష్ణవి మరోసారి లవ్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌లో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గురువారంనాడు హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్‌కు కథానాయిక రష్మిక మందన్నా క్లాప్ కొట్టారు. దీనికి సంబంధించిన ఫోటోలను నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పంచుకుంది. శివాజీ కెమెరా స్విచ్చాన్ చేశారు. డైరెక్టర్లు వెంకీ అట్లూరి, కళ్యాణ్ శంకర్ స్క్రిప్ట్ అందించారు. జూన్‌లో రెగ్యులర్ షుటింగ్ ప్రారంభమవుతుందని నిర్మాతలు తెలిపారు. ఈ లవ్ స్టోరీకి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతాన్ని అందిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలు ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

ఇంగ్లండ్ పర్యటనకు శ్రీచరణి

- భారత మహిళల జట్టును ప్రకటించిన బిసిసిఐ



ముంబయి: ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే భారత మహిళలజట్టును భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు (బిసిసిఐ) ప్రకటించింది. బిసిసిఐ గురువారం ప్రకటించిన జట్టులో వైఎస్ఆర్ జిల్లాకు చెందిన శ్రీచరణి వన్డే, టి20 జట్టులో చోటు దక్కించుకుంది. ఇటీవలే శ్రీలంక పర్యటనతో అరంగేట్రం చేసిన శ్రీచరణి.. తన అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకొని ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక కావడం విశేషం. ఇక భారత మహిళల క్రికెట్ జట్టు ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌లో భాగంగా ఆతిథ్య ఇంగ్లండ్‌తో ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లో భారత్ తలపడనుంది. ఈ క్రమంలో ఇంగ్లండ్‌తో వైట్‌బాల్ సిరీస్‌లకు భారత జట్టును బిసిసిఐ సెలక్షన్ కమిటీ గురువారం ప్రకటించింది. ఈ రెండు సిరీస్‌లలో భారత కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యవహరించనున్నారు. అదేవిధంగా ఇంగ్లండ్ టూర్‌కు స్టార్ ప్లేయర్లు శ్రేయాంక పాటిల్, రేణుకా సింగ్ గాయాల కారణంగా దూరమయ్యారు. శ్రేయాంక చేతి వేలి గాయంతో, రేణుకా మోకాలి గాయం కారణంగా జట్టుకు దూరంగా ఉన్నారు. అలాగే వన్డే జట్టు నుంచి కశ్వీ గౌతమ్‌ను సెలక్టర్లు తప్పించారు.

షెఫాలీ రీ ఎంట్రీ..

ఇక భారత టి20 జట్టులోకి స్టార్ ఓపెనర్ షెఫాలీ వర్మ రీ ఎంట్రీ ఇచ్చింది. మహిళల ప్రిమియర్ లీగ్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున షెఫాలీ అద్భుతంగా రాణించడంతో సెలక్టర్లు తిరిగి పిలుపు నిచ్చారు. ఈ ఏడాది డబ్ల్యుపిఎల్ సీజన్‌లో షెఫాలీ 152.76 స్ట్రైక్ రేటుతో 304 పరుగులు చేసింది. ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా సైతం టి20 జట్టులోకి పునరాగమనం చేసింది. ఇక భారత జట్టు ఇంగ్లండ్ పర్యటన జూన్ 28 నుంచి ప్రారంభం కానుంది.

టి20 జట్టు: హర్మన్(కెప్టెన్), మంధాన(వైస్ కెప్టెన్), షెఫాలీ, రోడ్రిగ్స్, రీచా, యాస్టికా(వికెట్ కీపర్లు), హర్లీన్, దీప్తిశర్మ, స్నేహ్ రాణా, శ్రీ చరణి, సుచి ఉపాధ్యాయ, అమన్‌జ్యోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, సయాలీ.

వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్(కెప్టెన్), మంధాన, ప్రతీకా రావల్, హర్లీన్, రోడ్రిగ్స్, రీచా, యాస్టికా(వికెట్ కీపర్లు), తేజల్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీ చరణి, సుచి ఉపాధ్యాయ్, అమన్‌జ్యోత్ కౌర్, అరుంధతి, క్రాంతి గాడ్, సయాలి.

షెడ్యూల్...

జూన్ 28(శని)	: తొలి టి20	ట్రెంట్ బ్రిడ్జ్	రా.7.00గం॥లకు
01 జులై(మంగళ)	: రెండో టి20	బ్రిస్టల్	రా.11.00గం॥లకు
04 (శుక్ర)	: మూడో టి20	లండన్	రా.11.05గం॥లకు
09(బుధ)	: నాల్గో టి20	మాంచెస్టర్	రా.11.00గం॥లకు
12(శని)	: ఐదో టి20	ఎడ్జ్‌బాస్టన్	రా.11.05గం॥లకు
16(బుధ)	: తొలి వన్డే	సౌథాంప్టన్	సా.5.30గం॥లకు
19(శని)	: రెండో వన్డే	లార్డ్స్	మ.3.30గం॥లకు
22(మంగళ)	: మూడో వన్డే	ఛెస్టర్ స్ట్రీట్	సా.5.30గం॥లకు

డబ్ల్యుటిసి విజేతకు రూ.30.70కోట్లు

ప్రైజ్ మనీ భారీగా పెంపు: ఐసిసి

దుబాయ్: ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్(డబ్ల్యుపిఎల్) టైటిల్ విజేతకు అందజేసే ప్రైజ్‌మనీని అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) భారీగా పెంపుదల చేసింది. ఇది గతంలో టైటిల్ విజేతకు అందజేసిన ప్రైజ్‌మనీ కంటే రెండింతలు ఎక్కువ. జూన్ 11నుంచి ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ జరగనుంది. అయితే ఆ ఫైనల్ నెగ్గిన జట్టుకు భారత కరెన్సీలో రూ.30.70కోట్లు, రన్నరప్ విజేత రూ.18.60కోట్లు నగదు అందుకోనున్నాయి. ఇది గత ఎడిషన్‌తో పోలిస్తే ఇది రెండింతలు ఎక్కువే. టెస్టు క్రికెట్ ప్రాముఖ్యతను పెంచే ఉద్దేశంతో ప్రైజ్‌మనీ పెంచినట్లు ఐసిసి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. దక్షిణాఫ్రికా జట్టు 69.44 శాతం పాయింట్లతో టేబుల్‌లో అగ్రస్థానంలో, డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా 67.54 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాయి. ఇక భారత్ 50.00 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఐసిసి ఛైర్మన్ జే షా మాట్లాడుతూ.. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌కు చెందిన మూడో సైకిల్ ఆసక్తికరంగా సాగినట్లు చెప్పారు. కాంపిటీషన్ చివరలో మాత్రమే ఫైనలిస్టుల వివరాలు తెలిసినట్లు తెలిపారు. వేర్వేరు దేశాలకు చెందిన ఆటగాళ్ల అసాధారణ పర్ఫార్మెన్స్ ఆకట్టుకున్నట్లు, లార్డ్స్‌లో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ఫైనల్ హోరాహోరీగా సాగడం ఖాయమని పేర్కొన్నారు. ఇక 2023లో ఇండియాపై ఫైనల్లో నెగ్గిన ఆస్ట్రేలియాకు రూ.13.70కోట్లు, రన్నరప్‌గా నిలిచిన భారత్‌కు రూ.6.80కోట్లు ప్రైజ్‌మనీ అందుకున్నారు.

బెంగళూరుకు ఊరట

ఐదుగురు విదేశీ ప్లేయర్లు రాక • సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ కెప్టెన్ కూడా...

ముంబయి: ఐపిఎల్ పునఃప్రారంభ సీజన్‌లో ఆడేందుకు ఒక్కొక్కరు బయల్దేరి భారత్‌కు చేరుతున్నారు. ప్లే ఆఫ్స్ బరిలో ఉన్న బెంగళూరు ఫ్రాంచైజీ స్టార్ బౌలర్ హేజిల్ వుడ్‌తో పాటు డేంజరస్ ఓపెనర్ ఫిలిప్ సాల్ట్, విధ్వంసక ఆటగాడు టిమ్ డేవిడ్, పేసర్ రొమారియో షెపర్డ్, ఆల్‌రౌండర్ లియాం లివింగ్‌స్టోన్‌లు గురువారం బెంగళూరు చేరుకున్నారు. బెంగళూరు జట్టు ఇంకా మూడు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. మే 17న కోల్‌కతాతో, మే 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో, మే 27న లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. ఈసారి బెంగళూరు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న విరాట్ కోహ్లి, పటిదార్, ఓపెనర్ సాల్ట్, కుర్రాడు టిమ్ డేవిడ్ .. అదే జోరు చూపిస్తే ఆ జట్టు 17ఏళ్ల కల సాకారం కావడం ఖాయం. అలాగే ఇంగ్లండ్ యువకెరటం బెథెల్ కూడా జట్టుతో కలిశాడు. మే 17న చిన్నస్వామి స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఆర్సీబీ తలపడనుంది.

మయాంక్ యాదవ్‌కు మళ్లీ గాయం

టీమిండియా స్పీడ్ స్టార్, లక్నో సూపర్ జెయింట్స్ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ మరోసారి గాయపడ్డాడు. మయాంక్ యాదవ్ వెన్ను గాయం కారణంగా ఐపిఎల్-2025 మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ విషయాన్ని లక్నో ఫ్రాంచైజీ గురువారం ప్రకటించింది. కాగా మయాంక్ ఈ సీజన్ మధ్యలో గాయం నుంచి కోలుకుని లక్నో జట్టులో చేరాడు. ఈ క్రమంలో కేవలం రెండు మ్యాచ్‌లు ఆడిన యాదవ్‌కు తన వెన్నుగాయం తిరగబెట్టింది. దీంతో అతడు మళ్లీ బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సిఎ)కు వెళ్లనున్నాడు. ఇక మయాంక్ యాదవ్ స్థానాన్ని న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ విలియం ఓరూర్క్‌తో లక్నో భర్తీ చేసింది. మరోవైపు పంజాబ్ కింగ్స్ కూడా గాయపడిన లాకీ ఫెర్గూసన్‌కు ప్రత్యామ్నాయ ఆటగాడిని ప్రకటించింది. మరో న్యూజిలాండ్ స్పీడ్ స్టార్ కైల్ జామీసన్ పంజాబ్ తమ జట్టులోకి తీసుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68